విలేకరులు కావలెను

TELANGANA VANI TELUGU DAILY R N I No. APTEL/2012/53127

తెలంగాణ వాణి

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును

9703247143



TELANGANA VANI TELUGU DAILY R N I No. APTEL/2012/53127

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

తెలంగాణ వాణి TV
THE VOICE OF TELANGANA
ఎడిటర్ జేరిపోతుల సంపత్
9912758107

సంపుటి: 16 | సంచిక : 110 | మంగళవారం 18. 8. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00


## నీటి పంపకాల్లో రాష్ట్రాల మధ్య విభేదాలు పెరుగుతున్నాయి

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఈ ఏడాది 35.5శాతం లోటు వర్షాపాతం ఉంటుంది
- గోదావరికి మాత్రం కొంత వరదనీరు వస్తోంది
- గత రెండేళ్లుగా నీటి నిర్వహణపై దృష్టి పెడుతున్నాం
- తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించాం
- గోదావరి బేసిన్ తప్ప ఎక్కడ వరిపంటలు వేసినా ఇబ్బందే అవుతుంది..



## బిల్లులు పెట్టినప్పుడు ఎటు ఓటు వేశారు

- పార్టీ ఫిరాయింపుల ఎమ్మెల్యేల విషయంలో తెలంగాణలో హైకోర్టు కీలక వ్యాఖ్యలు
- పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ దాఖలు
- పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో విచారణ
- సమర్పించినా స్పీకర్ ట్రిబ్యునల్ చర్యలు తీసుకోలేదని పిటిషనర్ వాదన



- తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి
- సనత్‌నగర్‌లో మర్రిచెన్నారెడ్డి టిమ్స్‌ను ప్రారంభించిన సీఎం
- "ప్రైవేటు వైద్యం అత్యంత ఖరీదుగా మారింది.
- ప్రతి పేదవాడికీ ఉచిత వైద్యం అందిస్తున్నాం.
- మా పాలనలో ఆరోగ్య శ్రీ కింద రూ.2,700 కోట్లు చెల్లించాం.
- రోగులతో పాటు ఆస్పత్రికి వచ్చే బంధువులకు ఆహారం, వసతి సౌకర్యం కల్పిస్తున్నాం.
- పేదలకు విశ్వాసం కలిగిస్తే మన జన్మ సార్థకం అయినట్లే.
- మన నర్సింగ్ స్టాఫ్‌పై జర్మనీ, జపాన్, దక్షిణకొరియా దేశాలు ఆసక్తి చూపిస్తున్నాయి.
- 2027 డిసెంబర్ 9లోపు ఉస్మానియా, ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్ ఆస్పత్రులను పూర్తిచేస్తాం.
- ఆరు నెలలకు ఒక ఆస్పత్రిని ప్రారంభిస్తాం.
- కార్పొరేట్ ఆస్పత్రుల్లాగే వీటిని నిర్వహిస్తాం.
- రోగులకు 70 శాతం నర్సింగ్ సిబ్బంది, మిగతా 30 శాతం వైద్యులు సేవలు అందిస్తారు.
- ఆరోగ్యశ్రీ కింద ప్రైవేట్‌లో ఎక్కువ నిధులు ఇస్తున్నాం.
- ప్రభుత్వ వైద్యులు ఆస్పత్రుల్లో అదనపు సేవలు అందిస్తే ప్రోత్సాహకాలు ఇస్తాం.
- కష్టం వస్తేనే సంక్షేమ పథకాలు ఉచితంగా పొందాలని అనుకుంటారు.
- గౌరవంగా బతకాలి, కష్టపడాలి అని ప్రజలు కోరుకుంటారు.

# ప్రభుత్వ వైద్యులు అదనపు సేవలందిస్తే ప్రోత్సాహకాలు

### వైద్యాన్ని అత్యంత ప్రాధాన్యాంశాలుగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది

హైదరాబాద్ తెలంగాణ వాణి)

విద్య, వైద్యాన్ని అత్యంత ప్రాధాన్యాంశాలుగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్య, వైద్యంపై చేసే వ్యయాన్ని పెట్టుబడిగా భావిస్తున్నామని చెప్పారు. సనత్‌నగర్‌లో మర్రిచెన్నారెడ్డి టిమ్స్‌ను సీఎం ప్రారం భించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. "ప్రైవేటు వైద్యం అత్యంత ఖరీదుగా మారింది. ప్రతి పేదవాడికీ ఉచిత వైద్యం అందిస్తున్నాం. మా పాలనలో ఆరోగ్య శ్రీ కింద రూ.2,700 కోట్లు చెల్లించాం. రోగులతో పాటు ఆస్పత్రికి వచ్చే బంధువులకు ఆహారం, వసతి సౌకర్యం కల్పిస్తున్నాం. పేదలకు విశ్వాసం కలిగిస్తే మన జన్మ సార్థకం అయినట్లే. మన నర్సింగ్ స్టాఫ్‌పై జర్మనీ, జపాన్, దక్షిణకొరియా దేశాలు ఆసక్తి చూపిస్తున్నాయి. 2027 డిసెంబర్ 9లోపు ఉస్మానియా, ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్ ఆస్పత్రులను పూర్తిచేస్తాం. ఆరు నెలలకు ఒక ఆస్పత్రిని ప్రారంభిస్తాం. కార్పొరేట్ ఆస్పత్రుల్లాగే వీటిని నిర్వహిస్తాం. రోగులకు 70 శాతం నర్సింగ్ సిబ్బంది, మిగతా 30 శాతం వైద్యులు సేవలు అందిస్తారు. ఆరోగ్యశ్రీ కింద ప్రైవేట్‌లో ఎక్కువ నిధులు ఇస్తున్నాం. ప్రభుత్వ వైద్యులు ఆస్పత్రుల్లో అదనపు సేవలు అందిస్తే ప్రోత్సాహకాలు ఇస్తాం. కష్టం వస్తేనే సంక్షేమ పథకాలు ఉచితంగా పొందాలని అనుకుంటారు. గౌరవంగా బతకాలి, కష్టపడాలి అని ప్రజలు కోరుకుంటారు. సంక్షేమ పథకాలు తగ్గించాలంటే ప్రజలు స్వతంత్రంగా బతికేలా అవకాశాలు కల్పించాలి" అని రేవంత్ అన్నారు.

# ప్రైవేట్ ఆస్తుల్ని 22ఏ జాబితా నుంచి త్వరలోనే తొలగిస్తాం

- రాష్ట్రంలో నిషేధిత జాబితాల్లో పొరపాట్లు ఉన్న మాట నిజమే.
- ఇది పాత జాబితాలనే హైకోర్టుకు సమర్పించడం ద్వారా చోటు చేసుకున్నది
- దీని వల్ల కొందరు ప్రైవేటు ల్యాండ్ యజమానులకు ఇబ్బంది కలిగింది రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులతో సుదీర్ఘ సమీక్ష
- అధికారులే ప్రైవేటు ఆస్తులను తొలగిస్తారు
- కొన్ని చోట్ల భూ సేకరణ చేస్తే.. పూర్తి సర్వే నంబరును బ్లాక్ చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి
- ఆఫీసుల చుట్టూ తిప్పించుకుంటే చర్యలే..



## సీఎం ఇల్లు కూడా నిషేధిత జాబితాలో ఉంది

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు
- అందుకే, జాబితా నుంచి తొలగించాలని హడావుడి చేస్తున్నారు
- "సీఎం పరిస్థితే అలా ఉంటే.. ప్రజల పరిస్థితి ఏంటి?
- నిషేధిత జాబితాలో ఆస్తులు ఎందుకు పెట్టారో విచారణ జరిపించాలి.
- ఎన్ని ఆస్తులు అలా పెట్టారో శ్వేతపత్రం విడుదల చేయాలి.
- ఆ జాబితా నుంచి ఎప్పటిలోపు తొలగిస్తారో ప్రభుత్వం చెప్పాలి.
- నిషేధిత జాబితా భూముల గురించి ఆర్టీఐ ద్వారా అడుగుతుంటే సమాధానం లేదు"

హైదరాబాద్ తెలంగాణ వాణి)

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఇల్లు కూడా నిషేధిత జాబితాలో ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. అందుకే, జాబితా నుంచి తొలగించాలని హడావుడి చేస్తున్నారని విమర్శించారు. మీడియాతో హరీశ్‌రావు చిట్‌చాట్ నిర్వహించారు. "సీఎం పరిస్థితే అలా ఉంటే.. ప్రజల పరిస్థితి ఏంటి?నిషేధిత జాబితాలో ఆస్తులు ఎందుకు పెట్టారో విచారణ జరిపించాలి. ఎన్ని ఆస్తులు అలా పెట్టారో శ్వేతపత్రం విడుదల చేయాలి. ఆ జాబితా నుంచి ఎప్పటిలోపు తొలగిస్తారో ప్రభుత్వం చెప్పాలి. నిషేధిత జాబితా భూముల గురించి ఆర్టీఐ ద్వారా అడుగుతుంటే సమాధానం లేదు" అని హరీశ్‌రావు అన్నారు.



## ఆ ఉగ్ర నెట్‌వర్క్‌ను భూస్థాపితం చేశాం: అమిత్ షా

- స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే.. 200 మందికిపైగా సభ్యుల్ని అరెస్టు
- "షహజాద్ భట్టీ నెట్‌వర్క్‌కు అనేక ఉగ్ర కార్యకలాపాల్లో ప్రమేయం ఉంది.
- తుపాకీతో ఇన్‌స్టాలో పోస్టు.. ఇంటికెళ్లి చూస్తే నోట్ల కట్టలు..!
- షహజాద్ భట్టీ నెట్‌వర్క్ అనేది పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఒక ఉగ్రవాద గ్రూప్.
- భారత్‌లో పలు బాంబు దాడులు, హత్యల వెనుక దీని హస్తం ఉంది

## విడాకులు ఇవ్వకుండా రెండో పెళ్లి చేసుకుంటే.. జీతంలో 20శాతం కోత

హైదరాబాద్ తెలంగాణ వాణి)

బహుభార్యత్వం నిషేధం దిశగా కీలక చర్యలు చేపడుతోన్న అస్సాం (గూంయిఎ) ప్రభుత్వం.. తాజాగా మరో నిర్ణయం తీసుకుంది. మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండా రెండో పెళ్లి చేసుకున్న ప్రభుత్వ ఉద్యోగుల జీతంలో కోత పెట్టనుంది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మసోమవారం ఈ కీలక ప్రకటన చేశారు."ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా చట్టబద్ధంగా తన భార్య నుంచి విడాకులు తీసుకోకుండా ఆమెను వదిలేసి మరో మహిళతో వివాహ బంధం ఏర్పరుచుకుంటే.. ఆ వ్యక్తిపై చర్యలు తీసుకుంటాం. సదరు ఉద్యోగి జీతం నుంచి 20శాతం కోత విధించి.. ఆ మొత్తాన్ని మొదటి భార్య బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేస్తాం. అయితే, ఆ ఉద్యోగి మొదటి భార్య దీని గురించి ప్రభుత్వం వద్ద దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది" అని సీఎం హిమంత వెల్లడించారు. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగుల్లో కొంతమంది విడాకుల ప్రక్రియ పూర్తికాకుండానే మరో మహిళతో కలిసి ఉంటున్న కేసులు వెలుగుచూసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు హిమంత తెలిపారు. విడాకుల అంశం కోర్టు వద్ద పెండింగ్‌లో ఉన్నా కూడా.. జీతంలో కోత కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## ఎస్‌బీలు బ్యాంకింగ్ సంస్కరణల తదుపరి దశకు సిద్ధం కావాలి

- ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీలు) తమ ఆర్థిక స్థితిని పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలి
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
- పీఎస్‌బీలు ఇప్పుడు గతంలో ఎదుర్కొన్న మొండి బకాయిల సమస్య నుంచి చాలావరకు బయటపడ్డాయి.
- సమర్థంగా ఉన్న బ్యాలెన్స్ షీట్లను కేవలం రిస్క్ తగ్గించుకోవడానికి కాకుండా, దేశ తదుపరి దశ ఆర్థిక వృద్ధికి ఉపయోగించాలి



## వాళ్లది ఫ్యామిలీ జస్టిస్ పార్టీ.. మీది బ్రదర్స్ జస్టిస్ పార్టీ..

హైదరాబాద్ తెలంగాణ వాణి)

బీఆర్ఎస్‌ను ఆయన 'కుటుంబ న్యాయం చేసే పార్టీ'గా సీఎం అభివర్ణించారని, బీఆర్ఎస్ నిజంగానే ఒక కుటుంబం కోసమే పనిచేసే పార్టీ అని అన్నారు. కానీ కాంగ్రెస్ మాత్రం 'సోదరుల న్యాయం' చేసే పార్టీ. వాళ్లది ఒక కుటుంబానికి న్యాయం అయితే, మీది సోదరులకు న్యాయమని ఎద్దేవా చేశారు. ప్రజలకు నిజమైన న్యాయం చేసే పార్టీ ఏదైనా ఉందంటే, అది ఒక్క భారతీయ జనతా పార్టీ మాత్రమేనని తేల్చి చెప్పారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఓబీసీ మోర్చా తొలి రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. తెలంగాణ బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఓబీసీ మోర్చాజాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ కూడా హాజరయ్యారు.



## పంటలు ఎండిపోకుండా చర్యలు చేపట్టాలి

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- సాగర్ ఆయకట్టు పరిధిలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నీటి లభ్యత
- గోదావరి జలాలను రాజీవ్ లింక్ కెనాల్‌కు విడుదల
- రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా సాగర్ ఆయకట్టు కింద ఉన్న ప్రధాన చెరువులకు నీరు



## దప్పు కళాకారులకు రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలి

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు టీఎంఆర్పీఎస్ వినతి



**కొత్తగూడెం, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
దప్పు వాయిస్తూ సంప్రదాయ కళను కొనసాగిస్తున్న మాదిగ కళాకారులకు నెలకు రూ.5 వేల పెన్షన్ మంజూరు చేయాలని తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (టీఎంఆర్పీఎస్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు టీఎంఆర్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుండా రమేష్ మాదిగ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిసి వినతిపత్రం అందజేశారు. దప్పు కళాకారులకు నెలవారీ పెన్షన్‌తో పాటు మాదిగ దండోరా ఉద్యమకారులకు 200 గజాల స్థలం కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. అర్హులైన దళితులకు 'అంబేద్కర్ అభయహస్తం' పథకం కింద రూ.12 లక్షల ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపై ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సానుకూలంగా స్పందిస్తూ, మాదిగల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకులు జీడి శ్రీనివాస మాదిగ, జిల్లా అధ్యక్షుడు మచ్చ పృథ్వీరాజ్ మాదిగ, టీఎంవైఎస్ జిల్లా అధ్యక్షుడు బొమ్మెర అశోక్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం..

పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని, దీనిని నిరసిస్తూ ఏజెన్సీ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవా విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌లో ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఏజెన్సీ ప్రాంత యువతకు పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో 75 శాతం రిజర్వేషన్‌తో ప్రత్యేక అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం విడుదలైన నోటిఫికేషన్‌లో ఏజెన్సీ ప్రాంత అభ్యర్థులకు ప్రాధాన్యత లేకుండా ఉందని, సాధారణ విధానంలో నియామకాలు చేపట్టడం వల్ల ఏజెన్సీ ప్రాంతానికి చెందిన వేలాది మంది ఆదివాసీ యువత ఉద్యోగ అవకాశాలను కోల్పోయే ప్రమాదం ఉందని వాపోయారు. ఏజెన్సీ ప్రాంతంలో విద్యా, ఆర్థిక, ఉపాధి పరంగా ఇప్పటికే అనేక సమస్యలు ఎదుర్కొంటున్న ఆదివాసీ యువతకు ఉన్న ప్రత్యేక అవకాశాలను కూడా తొలగించడం సరైన నిర్ణయం కాదని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంత యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తక్షణమే స్పందించి, పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో గతంలో అమలులో ఉన్న 75 శాతం ప్రత్యేక రిజర్వేషన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఏజెన్సీ బంద్‌కు పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు. బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు సంపూర్ణ మద్దతు ఇచ్చి సహకరించాలని కోరారు.

మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన.. అత్యధిక ఫిర్యాదులు ఆ జిల్లాలోనే

## మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన లభించింది.



ప్రజల సమస్యలను స్థానికంగానే పరిష్కరించాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. తమ కష్టాలను చెప్పుకొనేందుకు ప్రజలు జిల్లా కేంద్రాలు, రాష్ట్ర రాజధాని దాకా వెళ్లే వ్యయప్రయాసలను తప్పిస్తూ.. ముంగిటకే పాలనను తీసుకెళ్లే లక్ష్యంతో సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. తొలిరోజే ప్రజల నుంచి భారీగా స్పందన రాగా.. మొత్తం 5,410 వినతులు స్వీకరించినట్లు అధికారులు వెల్లడించారు. పది వేల మందికి పైగా అధికారులు.. రాష్ట్రంలోని 565 మండల ప్రజా పరిషత్ కార్యాలయాలతో పాటు సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలోనూ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 566 కేంద్రాల్లో జరిగిన ఈ కార్యక్రమానికి వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన 10,753 మంది అధికారులు హాజరయ్యారు. ఉదయం నుంచే తమ సమస్యల పరిష్కారం కోసం బారులు తీరిన ప్రజల కోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అర్జీదారుల సౌకర్యార్థం శాఖలవారీగా డెస్కులు, మార్గనిర్దేశం చేసేందుకు హెల్ప్ డెస్కులతో పాటు మంచినీటి వసతిని కల్పించారు. ప్రతి వినతిని అధికారులు స్వీకరించి, సమస్య స్వభావాన్ని అడిగి తెలుసుకున్నారు. అర్జీల్లో కరీంనగర్ టాప్ రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో జిల్లా నుంచి సగటున 164 అర్జీలు అందాయి. అత్యధిక వినతులు అందిన జిల్లాగా కరీంనగర్ మొదటి స్థానంలో నిలిచింది. ఆ జిల్లాలో ఏకంగా 704 మంది బాధితులు అధికారులకు ఫిర్యాదులు సమర్పించారు. మండలాల సగటులోనూ కరీంనగర్ ముందంజలో ఉంది. అక్కడ ఒక్కో మండలానికి సగటున అత్యధికంగా 47 ఫిర్యాదులు రావడం గమనార్హం.

ప్రజావాణి విజయవంతమైన నేపథ్యంలో.. కార్యక్రమ వివరాలను ప్రజావాణి రాష్ట్ర ఇన్‌ఛార్జి డాక్టర్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కె.విద్యాసాగర్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. స్థానికంగానే వినతులు స్వీకరించడం ద్వారా పాలన ప్రజలకు మరింత చేరువవుతుందని వారు అభిప్రాయపడ్డారు. సోమవారం స్వీకరించిన వినతులను ఆయా సంబంధిత శాఖలకు పంపించి, క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని వారు స్పష్టం చేశారు.

## ప్రజారవాణాకు ఒకే వేదిక.. త్వరలో 'మీటికెట్' యాప్

రాష్ట్రంలో ప్రజారవాణా వ్యవస్థను ఆధునికీకరించి ప్రయాణికులకు మరింత మెరుగైన, సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు టీజీఎస్ ఆర్టీసీ సరికొత్త నిర్ణయం తీసుకుంది. ప్రయాణ రంగానికి సంబంధించిన అన్ని రకాల సేవలను ఒకే గొడుగు కిందికి తీసుకురావడమే లక్ష్యంగా మీసేవ ఆధ్వర్యంలో 'మీటికెట్' పేరుతో వినూత్న మొబైల్ యాప్‌ను అభివృద్ధి చేస్తోంది.

### ఒకే వేదికపై అన్ని సేవలు.. సులువైన ప్రయాణం

ఈ 'మీటికెట్' యాప్ ద్వారా ఆర్టీసీ బస్సులు, మెట్రో రైళ్లు, ఆటోలు, ప్రైవేట్ క్యాబ్‌లు వంటి ప్రధాన ప్రజారవాణా వ్యవస్థలన్నీ ఒకే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై అనుసంధానమవుతాయి. దీనివల్ల ప్రయాణికుడు ఒకే చోట ఆర్టీసీ లేదా మెట్రో టికెట్ తీసుకోవడంతో పాటు, తమ తుది గమ్యస్థానానికి చేరుకోవడానికి అవసరమైన ఆటో లేదా క్యాబ్‌ను కూడా ముందస్తుగా బుక్ చేసుకునే సదుపాయం లభిస్తుంది. ఈ యాప్‌లో ప్రయాణికుల కోసం ఆధునిక చెల్లింపుల వ్యవస్థను అందుబాటులోకి తెస్తున్నారు. ప్రయాణికులు యాప్ ద్వారా చెల్లించిన రుసుమును ఆయా రవాణా విభాగాలు, సర్వీస్ భాగస్వాములకు ఎప్పటికప్పుడు ఆటోమేటిక్‌గా జమ చేసేలా సాంకేతికతను రూపొందించారు. ఈ ఉమ్మడి ప్లాట్‌ఫామ్‌లో ఆటో, క్యాబ్ డ్రైవర్లతో పాటు ఇతర రవాణాదారులు భాగస్వాములుగా చేరి నేరుగా ప్రయాణికులకు సేవలు అందించి ఆదాయం పొందవచ్చని సంస్థ ఎండీ వై నాగిరెడ్డి తెలిపారు. వినియోగదారులకు సమయం ఆదాతో పాటు పూర్తిస్థాయి ప్రయాణ అనుభవం లభిస్తుందని పేర్కొంది.

### ఆర్టీసీ సొంత ఆటోల ప్రచారంపై ఖండన...

ఆర్టీసీ సంస్థ సొంతంగా ఆటోలను కొనుగోలు చేసి నడపబోతోందంటూ ఇటీవల సోషల్ మీడియా, పలు పత్రికలు, ఇతర వేదికల్లో జరుగుతున్న ప్రచారాలపై యాజమాన్యం తీవ్రంగా స్పందించింది. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పింది. ఆర్టీసీ స్వయంగా ఆటోలను కొనుగోలు చేయడం కానీ, వాటిని నిర్వహించడం కానీ చేయబోదని, భవిష్యత్తులోనూ అలాంటి ప్రతిపాదన ఏదీ లేదని స్పష్టం చేసింది. తప్పుడు ప్రచారాలు నమ్మి ఆటో డ్రైవర్లు, ప్రయాణికులు ఎలాంటి అపోహలకు గురికావద్దని టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం విజ్ఞప్తి చేసింది.

# అలియాస్ పేర్ల సమస్య పరిష్కారానికి కమిటీ

- నెల రోజుల్లో సమస్యకు శాశ్వత పరిష్కారం
- కార్మికుల వారసుల దీక్షల విరమణ
- సమస్యను పరిష్కరించకుంటే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం
- డిస్మిస్డ్ కార్మికులనూ మానవతా దృక్పథంతో చూడాలి
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 17 (తెలంగాణ వాణి)**
సింగరేణి సంస్థలో మారుపేర్లతో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను నెల రోజుల్లో పరిష్కరించేందుకు యాజమాన్యం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిందని, ఈ నిర్ణయంతో కార్మికుల వారసులకు న్యాయం జరుగుతుందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట అలియాస్ పేర్ల బాధితులు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షలను సోమవారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సింగరేణి పర్సనల్ జనరల్ మేనేజర్ కిరణ్ కుమార్ బాధితులకు నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పూర్వం కార్మికులు దొరకని రోజుల్లో ఉద్యోగాల్లో చేరినప్పుడు పేర్లలో తప్పులు దొర్లాయని, దీనివల్ల నేడు వారి పిల్లలకు ఉద్యోగాలు రాక తీవ్ర మానసిక ఆందోళన చెందుతున్నారన్నారు, తప్పుడు పేర్లు ఉన్నాయని సింగరేణి విజిలెన్సు విభాగం విచారణపేరుతో వేధింపులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. విజిలెన్సు విచారణలో ఉండటంతో వారసులకు యాజమాన్యం ఉద్యోగాలు ఇవ్వండంలేదన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం కోల్ బెల్ట్ ఎమ్మెల్యేల సమావేశంలో యాజమాన్యంతో చర్చించామని తెలిపారు. ఫలితంగా ముగ్గురు యాజమాన్య ప్రతినిధులు, ఇద్దరు ఏఐటీయూసీ, ఒకరు ఐఎన్‌టీయూసీ ప్రతినిధులతో కూడిన ఆరుగురు సభ్యుల కమిటీని యాజమాన్యం ఏర్పాటు చేసిందన్నారు. ఈ కమిటీ నెల రోజుల్లో సమస్యను అధ్యయనం చేసి పరిష్కార మార్గాన్ని చూపుతుందని ఆయన స్పష్టం చేశారు. యాజమాన్యం ఇచ్చిన హామీ మేరకు నెలరోజుల్లో సమస్యను పరిష్కరించని పక్షంలో కార్మిక వారసుల ఉద్యమ కార్యాచరణ ప్రకటించి పోరాడతామని, ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి పరిస్కారానికి కృషిచేస్తానని స్పష్టం చేశారు. అలాగే గతంలో వివిధ కారణాలతో డిస్మిస్ అయిన కార్మికుల సమస్యను కూడా యాజమాన్యం మానవతా దృక్పథంతో పరిశీలించి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, యూనియన్ నాయకులు వంగ వెంకట్, జి వీరాస్వామి, శేషయ్య, రమణమూర్తి, గట్టయ్య, కిష్టాఫర్, సందెబోయిన శ్రీనివాస్, మాతంగి లింగయ్య, బండారి మల్లయ్య, నర్సయ్య, కార్మికుల వారసులు లక్క శ్రావణ్, ధనాల రాజేందర్, జె రాజేందర్, డిష్ బాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ది ఇటలీ నేషనల్ కాంగ్రెస్.. తిరుపతిలో బండి సంజయ్

దేశం నుంచి కాంగ్రెస్ పార్టీ, ఎంఐఎంలను తరిమికొట్టాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. తిరుపతిలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వందేమాతరం గీతాన్ని అవమానించడం సిగ్గుచేటని, సోనియాగాంధీ, మల్లిఖార్జున ఖర్గేలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వందేమాతరం చరిత్రను సోనియాగాంధీ తెలుసుకోవాలని కోరారు. దేశం మారితే సరిపోదని, దేశం విలువలు, సంస్కృతి, వేల ఏళ్ల చరిత్ర తెలిసి ఉండాలన్నారు. 'ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కాదది... ఇటలీ నేషనల్ కాంగ్రెస్' అని ఎద్దేవా చేశారు. వందేమాతరం గీతాన్ని విని ఆనాడు బ్రిటిష్ భయపడిందని, వందేమాతరం పూర్తి గీతాన్ని చూసి కాంగ్రెస్ వణుకుతోందన్నారు. విద్యార్థుల్లో విపక్షాలు విష బీజాలు నింపాయని, విపక్షాల మాటల్లోని అంతరార్థాన్ని గ్రహించాలని యువతను కోరుతున్నానని తెలిపారు. వాస్తవాలను గ్రహించకపోతే విద్యార్థులు మోసపోతారని, వందేమతరాన్ని కాంగ్రెస్ అవమానించడంపై రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ ఎన్నటికీ ఒక్కటి కాదని, కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటేనని, గతంలో ఈ రెండు పార్టీలు కలిసి పోటీ చేసి అధికారం పంచుకున్నాయని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా రెండు పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందం నడుస్తోందని, అందుకే బీఆర్ఎస్ అవినీతి కేసులన్నీ అటకెక్కాయని అన్నారు.



సిట్ కు అప్పగించిన కేసులన్నీ సీఎం సిట్ అంటే సిట్ స్టాండ్ అంటే స్టాండ్ అంటున్నాయని విమర్శించారు.

బీఆర్ఎస్ అవినీతి కేసులు కాంగ్రెస్‌కు ఏటీఎం

బీఆర్ఎస్ అవినీతి కేసులు కాంగ్రెస్ కు ఏటీఎంలా మారాయని, బీఆర్ఎస్ అవినీతి బయటకు వచ్చినప్పుడల్లా కాంగ్రెస్ నేతలకు మూటలు అందుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్‌కు మూటలు అప్పగించగానే బీఆర్ఎస్ అవినీతి కేసులన్నీ ఒక్కొక్కటిగా క్లోజ్ అవుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అడ్రస్ లేకుండా పోయాయని, ఆ రెండు పార్టీలను తెలంగాణ ప్రజలు బుద్ధి చెప్పే రోజులు రాబోతున్నాయని హెచ్చరించారు. తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని కోరుకుంటున్నారని, అప్పులు తీరి అభివృద్ధి జరగాలంటే బీజేపీ అధికారంలోకి రావాల్సిందేనని స్పష్టం చేశారు. తెలంగాణలో సింగిల్ గా పోటీ చేసి అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తంచేశారు.

దేశ అంతర్గత భద్రతా సేవల్లో సీఆర్పీఎఫ్ భేష్

తిరుపతిలో సీఆర్పీఎఫ్‌కు సంబంధించి నూతనంగా నిర్మించిన ఆఫీసర్స్ మెస్, సబార్డినేట్ ఆఫీసర్స్ మెస్, రిక్రియేషన్ క్లబ్, స్టోర్, ట్రేడ్స్‌మెన్ బ్లాక్ భవనాల సముదాయాన్ని కేంద్ర మంత్రి ప్రారంభించారు. ఇందులో రూ.9.47 కోట్లతో ఆఫీసర్స్ మెస్, రూ.7.9 కోట్లతో సబార్డినేట్ మెస్, రూ.4.9 కోట్లతో రిక్రియేషన్ క్లబ్, రూ.4.55 కోట్లతో స్టోర్ బ్లాక్ భవనాలను నిర్మించారు. ఆయా భవనాలను నేడు కేంద్ర మంత్రి బండి సంజయ్ జాతికి అంకితం చేయడం గమనార్హం. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ ఏడీజీ సౌత్ జోన్ రవిదీప్ సింగ్ సాహి, ఐజీ దినేష్ ప్రతాప్ ఉపాధ్యాయ్, బ్రిగేడియర్ అనుపమ్ శర్మ, డీఐ సుభాష్ చంద్ర శర్మ, చీఫ్ ఇంజనీర్ సీఎన్.సురేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీఆర్పీఎఫ్ జవాన్లను ఉద్దేశించి కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడారు. సీఆర్పీఎఫ్ బలగాలకు అందిస్తున్న మౌలిక వసతులను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. దేశ భద్రత, సార్వభౌమత్వం కోసం మీ ప్రాణాలను సైతం పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నారని, అందుకే మీకు సాధ్యమైనంత మెరుగైన, ప్రపంచస్థాయి సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు.

# కొమురం భీం స్ఫూర్తితోనే తుపాకీ పట్టిన..

కొమురం భీమ్ స్ఫూర్తితోనే తాను ఉద్యమంలోకి వచ్చానని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలో ఆమె సుడిగాలి పర్యటన చేపట్టారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకున్న అనంతరం.. కొత్తగూడ మండల కేంద్రంలో కొమురం భీమ్ కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. అనంతరం మోకాళ్లపల్లి గ్రామంలో కొమురం భీమ్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ నిర్వహించారు.

ప్రజావాణిలో సమస్యలపై ఆరా

కొత్తగూడ రైతు వేదికలో నిర్వహించిన ప్రజావాణికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. రహదారులు, తాగునీరు, విద్యుత్, ఇళ్లు, భూములు, పింఛన్లు, సంక్షేమ పథకాలకు సంబంధించిన సమస్యలను మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించిన మంత్రి.. ఒక్కొక్కరి సమస్యను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడంతో పాటు పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి పరిష్కారం చూపడమే ప్రజావాణి లక్ష్యమని సీతక్క అన్నారు.

కొమురం భీమ్ స్ఫూర్తితోనే తుపాకీ పట్టా

మోకాళ్లపల్లిలో కొమురం భీమ్ విగ్రహానికి భూమి పూజ అనంతరం మంత్రి సీతక్క చేసిన వ్యాఖ్యలు ప్రత్యేకంగా నిలిచాయి. తన ఉద్యమ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్న ఆమె.. కొమురం భీమ్ స్ఫూర్తితోనే ఉద్యమంలోకి వచ్చానని "కొమురం భీమ్ స్ఫూర్తితోనే ఉద్యమంలోకి వెళ్లాను. మోకాళ్లపల్లి గ్రామంలో రాముతో పాటు అనేక మంది తుపాకీ పట్టుకుని ఉద్యమంలో చేరారు. నేను కూడా కొమురం భీమ్ స్ఫూర్తితోనే తుపాకీ పట్టాను అని అమరవీరుల సాక్షిగా మోకాళ్లపల్లి గ్రామంలో కొమురం భీమ్ విగ్రహానికి



శంకుస్థాపన చేయడం నాకు ఎంతో ప్రత్యేకం అని ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం కోసం కొమురం భీమ్ చేసిన పోరాటం ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

రూ.2 కోట్లతో స్మారక భవనాలు

కొత్తగూడ మండల కేంద్రం, మోకాళ్లపల్లి గ్రామాల్లో కొమురం భీమ్ స్మారక భవనాల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రెండు ప్రాంతాల్లో కలిపి దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో ఈ నిర్మాణాలను చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. ఆదివాసీల చరిత్ర, సంస్కృతి, పోరాట స్ఫూర్తి భావితరాలకు అందేలా స్మారక భవనాలను నిర్మిస్తున్నామని కొమురం భీమ్ ఆశయ సాధనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేపిస్తా

కొత్తగూడ, గంగారం మండలాల తాగు, సాగునీటి సమస్యపై మంత్రి సీతక్క కీలకంగా స్పందించారు. మన పక్కనే పాకాలవాగు.. అటు గోదావరి.. అయినా మనకు నీళ్లు అందడం లేదు ఈ ప్రాంతానికి సమీపంలోనే సమృద్ధిగా నీటి వనరులు ఉన్నప్పటికీ వాటి పూర్తి ప్రయోజనం ప్రజలకు, రైతులకు అందడం లేదని, పాకాలవాగు నీటిని వినియోగించుకుని కొత్తగూడ, గంగారం రెండు మండలాలకు తాగు, సాగునీరు అందించేలా ప్రతిపాదనలు రూపొందించినట్లు తెలిపారు. కొత్తగూడ, గంగారం రెండు మండలాలకు పాకాలవాగు నీరు వచ్చే విధంగా ప్రతిపాదనలు చేశాం. త్వరలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేపిస్తా" అని మంత్రి హామీ ఇచ్చారు. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే రెండు మండలాల్లోని పలు గ్రామాలకు తాగునీటి సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు రైతులకు సాగునీటి ప్రయోజనం కలిగే అవకాశం ఉందన్నారు.

మంత్రి పర్యటనలో భాగంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన గ్రామ కమిటీ అధ్యక్షుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క నూతన అధ్యక్షులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల,గ్రామ,పార్టీ నాయకులు సర్పంచ్ లు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఖర్గే అవమానంపై కాంగ్రెస్ ఎస్సీ సెల్ ధర్నా

**బీజేపీపై ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఫైర్**

**కరీంనగర్, ఆగస్టు 17 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
దళితుల పట్ల బీజేపీ అనుసరిస్తున్న వివక్ష, అణచివేత విధానాలకు వ్యతిరేకంగా దళితులు ఐక్యంగా ఉద్యమించాలని టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు జరిగిన అవమానాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్‌లో ధర్నా నిర్వహించారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొరివి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కవ్వంపల్లి మాట్లాడుతూ ఖర్గేకు జరిగిన అవమానాన్ని దళితుల ఆత్మగౌరవం, అస్తిత్వంపై జరిగిన దాడిగా భావించాలన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నుంచి మల్లికార్జున ఖర్గే వరకు దళిత నాయకులపై అవమానాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడేందుకు దళితులు, బడుగు బలహీన వర్గాలు, మైనార్టీలు, ప్రజాస్వామ్యవాదులు ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ



చైర్మన్ సత్తు మల్లేశ్ మాట్లాడుతూ ఖర్గే పాల్గొన్న వేదికను గంగాజలంతో శుద్ధి చేయడం అంటరానితనాన్ని ప్రతిబింబిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్ మాట్లాడుతూ వేదికలను శుద్ధి చేయడం కాదని, కుల వివక్షతో కూడిన మనస్తత్వాలను మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొరివి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ కులం, మతం పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందే శక్తులను తిప్పికొట్టాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సెల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూ వివాదంపై మహిళ ఆత్మహత్యాయత్నం

**బెజ్జంకి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉద్రిక్తత**

**బెజ్జంకి, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
భూ వివాదంలో న్యాయం చేయాలని కోరుతూ ఓ మహిళ, ఆమె కుమార్తె సోమవారం బెజ్జంకి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో ఉద్రిక్తత నెలకొంది. బెజ్జంకికి చెందిన అందె లక్ష్మి, తన కుమార్తెతో కలిసి కార్యాలయం వద్దకు వచ్చి తమ భూ సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం ఇద్దరూ తమపై పెట్రోల్ పోసుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు, రెవెన్యూ సిబ్బంది అప్రమత్తమై అడ్డుకున్నారు. దీంతో ప్రమాదం తప్పింది. తమ భూ వివాదం కోర్టులో పెండింగ్‌లో ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్‌కు ప్రయత్నాలు జరుగుతున్నాయని వారు




ఆరోపించారు. భూ రికార్డులు, హక్కులను పరిశీలించి తమకు న్యాయం చేయాలని అధికారులను కోరారు.

# నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం : ఎస్పీ అశోక్‌కుమార్



**జగిత్యాల, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
నేరాల నియంత్రణ, కేసుల ఛేదన, ప్రజల భద్రతలో సీసీ కెమెరాలు కీలకమని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం మల్యాల గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన 48 సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. సీసీ కెమెరాల ఫుటేజీతో నిందితులను త్వరగా గుర్తించి అరెస్టు చేయడంతో పాటు నేర నిరూపణకు కూడా అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు తమ ఇళ్లు, వ్యాపార సంస్థలు, అపార్ట్‌మెంట్ల వద్ద కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కెమెరాల ఏర్పాటుకు సహకరించిన గ్రామపంచాయతీ పాలక మండలి, ప్రజాప్రతినిధులను ఎస్పీ అభినందించారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్ బి. సత్యప్రసాద్

**జగిత్యాల, ఆగస్టు 17 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: ప్రజావాణి ద్వారా అందిన ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి 41 ఫిర్యాదులు, వినతులను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సంబంధిత శాఖల అధికారులు సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. ఇకపై అన్ని ఫైళ్లను కలెక్టరేట్ కార్యాలయం ద్వారానే పంపించాలని జిల్లా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.ఎస్. లత, బి. రాజగౌడ్, జిల్లా రెవెన్యూ




అధికారి ప్రసాద్, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు

# మండల స్థాయిలోనే ప్రజా సమస్యలకు పరిష్కారం : ఎమ్మెల్యే కవ్వంపల్లి

**తిమ్మాపూర్, ఆగస్టు 17 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహించడం ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువవుతాయని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.సోమవారం తిమ్మాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎమ్మెల్యే ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడారు. తిమ్మాపూర్‌కు చెందిన ఒంటరి మహిళ ఇజ్జగిరి లింగవ్వకు పెన్షన్ మంజూరు పత్రాన్ని అక్కడికక్కడే అందజేశారు. పజలు జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మండల స్థాయిలోనే సమస్యలను పరిష్కరించుకునే అవకాశం కల్పించడం అభినందనీయమని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం రాజీవ్ మల్హోత్రా, తహసిల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి సురేందర్,మండల వైద్యాధికారి డాక్టర్



పుల్లారావు,ట్రాన్స్కో ఏ ఈ కాసిం, సీఐ బొల్లం రమేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేష్, స్థానిక సర్పంచ్ గంగిడి లక్ష్మారెడ్డి, ప్యాక్స్ చైర్మన్ లు మోరపల్లి రమణారెడ్డి, గోపు మల్లారెడ్డి, పార్టీ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, మామిడి అనిల్ కుమార్, చింతల లక్ష్మారెడ్డి, పోలు రాము,రమేష్,పొన్నాల సంపతి, కేతిరెడ్డి ఎల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు

# పెండింగ్ డీఏలు ప్రకటించి పీఆర్సీ అమలు చేయాలి



**ధర్మారం, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
ఉపాధ్యాయులకు బకాయి ఉన్న ఆరు డీఏలను వెంటనే ప్రకటించి, పీఆర్సీని తక్షణమే అమలు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర బాధ్యుడు దామరపల్లి జయపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ధర్మారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు అందజే యడంతో పాటు ఆసుపత్రుల జాబితాను ప్రకటించాలని, ప్రమోషన్లతో కూడిన బదిలీల షెడ్యూల్‌ను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గుర్రాల గంగారెడ్డి, జిల్లా బాధ్యులు యాళ్ల రాజేందర్ రెడ్డి, కోట శశిధర్, ముద్దసాని సతీష్, మహేందర్, మండల ప్రధాన కార్యదర్శి గడ్డం దశరథ రెడ్డి, మండల బాధ్యులు చీకటి మల్ల ప్రసాద్ తో పాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

**కోరుట్ల రూరల్, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
కోరుట్ల మండలంలోని వివిధ గ్రామాల్లో మహిళలు నాగుల పంచమి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, పుట్టలో పాలు పోసి నైవేద్యాలు సమర్పించారు. సర్పదోషాలు తొలగుతాయని విశ్వాసంతో మహిళలు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. చిన్నారులు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు.

## మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ: సర్పంచ్ సంగమేశ్వర్ గౌడ్



**టేక్మాల్, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కుసంగి సర్పంచ్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సంగమేశ్వర్ గౌడ్ అన్నారు. సోమవారం కుసంగి గ్రామంలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురవాలంటే విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. ఇంటి ఆవరణలు, పొలాల గట్ల వద్ద, చెరువు కట్టలపై మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. మొక్కల పెంపకంతోనే భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ అంజయ్య, నారాయణ గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి పది దరఖాస్తులు




**మల్లాపూర్, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి పది దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో శ్రీకాంత్ తెలిపారు. సిరిపూర్ నుంచి ఒకటి, రత్నాపూర్ నుంచి రెండు, కుస్తాపూర్, మల్లాపూర్, మొగిలిపేట, వేంపల్లి, వెంకట్రావుపేట నుంచి ఒక్కొక్కటి, రేగుంట నుంచి రెండు దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తామని ఎంపీడీవో తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ ధర్నా



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పిలుపు మేరకు సోమవారం ఇబ్రహీంపట్నం మండలంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బీడీ కార్మికుల పెన్షన్‌దారులకు పెన్షన్లు అందించాలని, 57 ఏళ్లు నిండిన అర్హులకు వృద్ధాప్య పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాలను కొనసాగించాలని, ఒకే కుటుంబంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందించాలని కోరారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ఎంపీడీవో గణేష్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, బీడీ కార్మికులు, సర్పంచులు పాల్గొన్నారు.

## చిన్నారికి 'జస్విక శ్రీ' అని నామకరణం చేసిన కమిషనర్



**ఖమ్మం, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
గుండె సమస్యతో బాధపడుతున్న చిన్నారికి రూ.14 లక్షల ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, చిన్నారికి 'జస్విక శ్రీ' అని నామకరణం చేశారు. ఖమ్మంకు చెందిన రాకేష్, మాధవి దంపతుల కుమార్తెకు జూలై 28న గుండె శస్త్రచికిత్స విజయవంతంగా జరిగింది. కమిషనర్ సహకారంతో వైద్యం అందడంతో చిన్నారి కోలుకుంది. కృతజ్ఞతలు తెలిపేందుకు తల్లిదండ్రులు చిన్నారిని కమిషనర్ కార్యాలయానికి తీసుకురాగా, వారి కోరిక మేరకు ఆయన నామకరణం చేశారు.

## మండల స్థాయి ప్రజావాణికి 10 వినతులు



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
ప్రజా సమస్యలను స్థానికంగానే పరిష్కరించేందుకు నిర్వహించిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి 10 వినతులు అందాయి. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించి సంబంధిత శాఖలకు పంపించారు. వినతులపై తక్షణమే చర్యలు తీసుకుని పరిష్కరించాలని ఎంపీడీవో సీహెచ్ గణేష్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీఓ రామకృష్ణరాజు, ఎంఈఓ మధు, వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్‌తో పాటు 23 శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో తహసీల్దార్ కార్యాలయం నిర్మించాలి



**కొమురవెల్లి, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
కొమురవెల్లి మండలానికి మంజూరైన తహసీల్దార్ కార్యాలయాన్ని దేవస్థానం పరిసర ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండేలా నిర్మించాలని సీపీఎం మండల కమిటీ కోరింది. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో తహసీల్దార్ దివ్య, ఎంపీడీవో శైలజాదేవికి వినతిపత్రం అందజేశారు. మండ లంలోని 11 గ్రామాల ప్రజలకు సులభంగా చేరుకునే ప్రాంతంలో కార్యాలయం నిర్మించాలని సీపీఎం నాయకులు తాడూరి రవీందర్, బద్దిపడగ కృష్ణారెడ్డి కోరారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను కొనసాగించాలి: పింగిలి రమేష్



**జమ్మికుంట, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పేదల సంక్షేమ పథకాలను కొనసాగించాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంక్ వైస్ చైర్మన్ పింగిలి రమేష్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం జమ్మికుంటలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చే సంక్షేమ పథకాలను కొనసాగించాలని రమేష్ కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయాలని బీఆర్ఎస్ ధర్నా



**రాయికల్, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
నిలిచిపోయిన సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాయికల్ మండల, పట్టణ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కొనసాగించాలని, అర్హులైన వృద్ధులు, బీడీ కార్మికులకు ఆసరా పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. రైతుబీమా ప్రీమియం చెల్లించాలని, రైతులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా యూరియా అందించాలని, విద్యార్థుల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యకమంలో మండల మరియు పట్టణ అధ్యక్షులు బర్కం మల్లేష్, ఎలిగేటి అనిల్,మున్సిపల్ వైస్ ఛైర్మన్ తురగ సౌజన్య శ్రీధర్ రెడ్డి,కౌన్సిలర్లు రాకేష్ నాయక్,సర్పంచ్ గుమ్మడి సంతోష్,ప్రధాన కార్యదర్శులు రత్నాకర్ రావు,మహేష్ గౌడ్, నాయకులు కొయ్యాడి మహిపాల్ రెడ్డి,మ్యాకల రమేష్,బత్తిని భూమయ్య,నాగరాజు,గంగాధర్, ఎనుగంటి రవి,సుధీర్ రెడ్డి,కన్నక మహేందర్,అత్తినేని గంగారెడ్డి,చాంద్ పాషా,దివాకర్ రెడ్డి,ప్రశాంత్ రావు, రాజేందర్ గౌడ్,కోసరి మహేష్,మురళి, రమాపతిరావు బి.ఆర్.యస్ శ్రేణులు పాల్గొన్నారు.

## అనధికారిక 'ప్రెస్' స్టిక్కర్లపై చర్యలు తీసుకోవాలి



**రాయికల్, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
వాహనాలపై అనధికారికంగా 'ప్రెస్' స్టిక్కర్లు వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ విలేఖరుల యూనియన్ (టీయూడబ్ల్యూజే--ఐజేయూ) రాయికల్ ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు కోరారు. సోమవారం మండల ప్రజావాణిలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం గుర్తింపు పొందిన మీడియా ప్రతినిధులు మాత్రమే వాహనాలపై 'ప్రెస్' గుర్తును ఉపయోగించేందుకు అర్హులని తెలిపారు. అనధికారికంగా స్టిక్కర్లు వినియోగించడం వల్ల ప్రజలు తప్పుదోవ పట్టడంతో పాటు నిజమైన పాత్రికేయుల ప్రతిష్ఠకు భంగం కలుగుతుందని పేర్కొన్నారు. అధికారులు విచారణ జరిపి నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గుర్రాల వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి నాగమల్ల శ్రీకర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలకు మండల స్థాయిలోనే పరిష్కారం

### గ్రీవెన్స్ దరఖాస్తులపై స్పష్టమైన సమాధానం ఇవ్వాలి: మంత్రి సీతక్క



**ములుగు, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
ప్రజలు సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రాలు, హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా మండల స్థాయిలోనే గ్రీవెన్స్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. సోమవారం గోవిందరావుపేట మండల కేంద్రంలో నిర్వహించిన మండల ప్రజావాణికి మంత్రి హాజరై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రతి దరఖాస్తుపై స్పష్టమైన సమాధానం ఇవ్వాలని, పరిష్కారానికి పట్టే సమయాన్ని దరఖాస్తుదారులకు తెలియజేయాలని సూచించారు. ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సమాచారం అందించాలన్నారు. అత్యవసర సమస్యలపై తక్షణమే స్పందించాలని, మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను ఉన్నతాధికారులకు పంపించి పురోగతిని దరఖాస్తుదారులకు తెలియజేయాలని ఆదేశించారు. ఒంటరి మహిళలు, వితంతువులు, వికలాంగులు తదితర అర్హుల పింఛన్ దరఖాస్తులను ఈ నెల 31లోగా స్వీకరించాలని సూచించారు. అధికారులు మారుమూల గ్రామాలు, గూడేల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుని చిత్తశుద్ధితో పరిష్కరించాలని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## కంది సాగులో కొనల కత్తిరింపుతో అధిక దిగుబడి

### రైతులకు అవగాహన కల్పించిన ఏఈఓ సంతోష్



**కంగ్టి, ఆగస్టు 17 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కంది పంటలో అధిక దిగుబడి సాధించేందుకు సరైన సమయంలో కొనల కత్తిరింపు, చిగుళ్ల గిల్లడం వంటి యాజమాన్య పద్ధతులను పాటించాలని వ్యవసాయ విస్తరణ అధికారి సంతోష్ రైతులకు సూచించారు. సోమవారం కంగ్టి మండలం సుక్కల్తీర్థం గ్రామ శివారులో రైతులకు కంది పంట యాజమాన్యంపై అవగాహన కల్పించారు. కంది మొక్క పైకి ఎక్కువగా పెరగకుండా కొనలను తుంచడం వల్ల పక్క కొమ్మలు అధికంగా ఏర్పడి, పూత, కాయల సంఖ్య పెరుగుతుందని తెలిపారు. దీంతో పంట దిగుబడి పెరగడంతో పాటు మొక్కలు గాలికి పడిపోకుండా బలంగా తయారవుతాయని వివరించారు. విత్తిన 30--45 రోజుల మధ్య మొక్క 15--20 సెంటీమీటర్ల ఎత్తు ఉన్నప్పుడు కొనలను కత్తిరించాలని, అవసరాన్ని బట్టి 60--70 రోజుల మధ్య మరోసారి చిగుళ్లను గిల్లవచ్చని సూచించారు. పూత దశ ప్రారంభమైన తర్వాత కొనలు కత్తిరించకూడదని స్పష్టం చేశారు. ఈ పద్ధతితో తక్కువ ఖర్చుతో 20--30 శాతం వరకు అదనపు దిగుబడి పొందే అవకాశం ఉందని రైతులకు వివరించారు. కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

## కంగ్టి మండల ప్రజావాణికి పలు శాఖల అధికారులు గైర్హాజరు

### దరఖాస్తులు స్వీకరించడమే కాకుండా సమస్యలు పరిష్కరించాలి: ప్రజలు



**కంగ్టి, ఆగస్టు 17 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ప్రజల సమస్యలను స్థానికంగానే పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి సోమవారం కంగ్టి మండల పరిషత్ కార్యాలయంలో పలువురు శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీవో దయాకర్‌రావు అధ్యక్షతన ప్రజావాణి నిర్వహించారు. ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తామని, మండల ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు సమర్పించవచ్చని ఎంపీడీవో తెలిపారు. అయితే ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరించి సంబంధిత శాఖలకు పంపడానికే కార్యక్రమం పరిమితమవుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి సత్వర పరిష్కారం చూపాలని కోరారు. కంగ్టి మండల ప్రజావాణి నిర్వహణపై ఉన్నతాధికారులు సమీక్షించి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యపై ఉధృతమైన ఆందోళన

- రెండు దశాబ్దాల కలను చిదిమేస్తారా? -- బండ శ్రీనివాస్
- రిలే నిరాహార దీక్షలకు బీఆర్ఎస్ సంఘీభావం..
- కాంగ్రెస్ వార్తలను బహిష్కరిస్తామన్న వీణవంక జర్నలిస్టులు

**హుజురాబాద్, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కోరుతూ హుజురాబాద్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం రెండో రోజుకు చేరాయి. దీక్షా శిబిరాన్ని సందర్శించిన బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ జర్నలిస్టులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రెండు దశాబ్దాలుగా జర్నలిస్టులు పోరాడి సాధించుకున్న ఇళ్ల స్థలాల విషయంలో రాజకీయ కక్షసాధింపు చర్యలు సరికావన్నారు. గత ప్రభుత్వం స్థలాలు కేటాయించిన అనంతరం పలువురు జర్నలిస్టులు అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్నారని, ఈ దశలో సమస్యలు సృష్టించడం అన్యాయమన్నారు. జర్నలిస్టులపై నమోదైన కేసుల విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.



**ఉద్యమానికి వీణవంక ప్రెస్‌క్లబ్ మద్దతు**
హుజురాబాద్ జర్నలిస్టుల పోరాటానికి మద్దతుగా వీణవంక ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు దీక్షా శిబిరాన్ని సందర్శించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించకపోతే వీణవంక మండలంలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు, వార్తలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గందె రాధిక శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, పలువురు కౌన్సిలర్లు, బీసీ జేఏసీ, ముదిరాజ్ సంఘం నాయకులు, వీణవంక ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు జె. సతీష్, ప్రధాన కార్యదర్శి పి. శంకర్, జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## తాడు ఆట పేరుతో భక్తులను మోసం చేస్తున్న ఇద్దరి అరెస్ట్

**వేములవాడ, ఆగస్టు 17 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులను లక్ష్యంగా చేసుకుని 'తాడు ఆట' పేరుతో జూదం నిర్వహిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. హనుమకొండ జిల్లా ఐనవోలు, ఆత్మకూరు గ్రామాలకు చెందిన సురేందర్, దేవేందర్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్ తెలిపారు. వారి వద్ద నుంచి తాడు ఆట సామగ్రి, అప్సర పెన్సిళ్లు, రూ.2 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. భక్తులను మోసం చేసే అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని ఇన్‌స్పెక్టర్ సూచించారు.




# బస్ షెల్టర్ లేక ప్రయాణికుల అవస్థలు

**మరుగుదొడ్లు నిర్మించాలని వేడుకోలు**

**చిలుకూరు, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
చిలుకూరు మండల కేంద్రంలో బస్ షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఉన్న బస్ షెల్టర్‌ను రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించినప్పటికీ తిరిగి నిర్మించకపోవడంతో ఎండ, వర్షంలో ప్రయాణికులు రోడ్డుపైనే బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తోంది. వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు కూర్చునేందుకు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా మహిళలకు పబ్లిక్ మరుగుదొడ్లు లేక అవస్థలు తప్పడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు.



జాతీయ రహదారుల అధికారులు, గ్రామపంచాయతీ పాలకవర్గం స్పందించి బస్ షెల్టర్‌తో పాటు ఉచిత పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని కోరారు.

## ఏడీ శ్రీనివాసరావుకు పవర్లూమ్ సొసైటీ నాయకుల సన్మానం



**రాజపేట, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
పవర్లూమ్ కార్మికులకు చేనేత కార్మికుల మాదిరిగా 16 శాతం 'నేతన్నకు చేయూత' పథకం కింద ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని రాజపేట పవర్లూమ్ సొసైటీ నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్మికుల బ్యాంకు రుణాలకు సబ్సిడీ వర్తింపజేయాలని కోరారు. అనంతరం శ్రీనివాసరావును సొసైటీ అధ్యక్షుడు ఆడేపు రామకిష్టయ్య, పద్మశాలి సంఘం అధ్యక్షుడు చిన్నం వెంకటరమణ, సభ్యులు కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సకినాల శ్రీనివాసులు, కోశాధికారి పొట్టబతిని నరహరి, నరేందర్, చుంచు నారాయణ, సామల రాజు గర్దాస్ శ్రీశైలం, వనమ్ ఆనంద్, ఉపేందర్, చంద్రమౌళి, పెంట భాస్కర్, స్వర్గం రమేష్, వెంకటేష్ రేగొండ, ఎక్కల దేవి శ్రీరాములు,భోగ నాగేందర్, కాముని శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## రోబోటిక్స్ పుస్తకాలు కొనలేదని విద్యార్థులపై శిక్షలు

- సెయింట్ జోన్స్ పాఠశాలలో ఉపాధ్యాయుల ప్రతాపం
- కొనని విద్యార్థులను కొడుతున్నారంటూ తల్లిదండ్రుల ఆరోపణ
- డబ్బులు తీసుకున్నా రసీదులు ఇవ్వని వైనం
- పట్టించుకోని ఎంఈఓ.. విచారణకు తల్లిదండ్రుల డిమాండ్

**తిమ్మాపూర్, ఆగస్టు 17, (తెలంగాణ వాణి ప్రతినిధి)**
కరీంనగర్ జ్యోతి నగర్‌లోని సెయింట్ జోన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో రోబోటిక్స్ పుస్తకాలు కొనుగోలు చేయని విద్యార్థులను ఉపాధ్యాయులు శారీరకంగా దండిస్తున్నారంటూ తల్లిదండ్రులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. పుస్తకాలు కొనలేదని పిల్లలను కొట్టడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, పుస్తకాలు కొన్నప్పటికీ యాజమాన్యం ఎలాంటి రసీదులు ఇవ్వడం లేదని,




దీనిపై ఎంఈఓకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని వారు వాపోతున్నారు.ఈ ఘటనపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



## బుగ్గారం ఎంఈఓగా మోహన్‌రెడ్డి బాధ్యతలు

**బుగ్గారం, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
బుగ్గారం మండల విద్యాధికారిగా అన్నాడి మోహన్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఎంఈఓగా పనిచేసిన వెంకటేశ్వర్లు అనారోగ్య కారణాలతో బాధ్యతల నుంచి తప్పుకోవడంతో మోహన్‌రెడ్డి నియమితులయ్యారు. విద్యారంగ అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తానని ఆయన తెలిపారు. అనంతరం ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రధానోపాధ్యాయులు మోహన్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, శ్రీలత ఉపాధ్యాయ సంఘాల నాయకులు విజయ్ కుమార్, సతీష్ రావు, కొమరయ్య, రాజేష్, అశోక్, ప్రకాష్, ఎం ఆర్ సి సిబ్బంది పురుషోత్తం, రాజేష్, హరిత, సమత ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు




## కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌పై ఆంక్షలు వద్దు: మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్

**హుస్నాబాద్, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై ఎలాంటి ఆంక్షలు విధించకుండా యథావిధిగా కొనసాగించాలని మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన ధర్నా, రాస్తారోకోలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలిచిన సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేస్తే సహించబోమన్నారు. ఎన్నికల హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని వినతి



**రాజపేట, ఆగస్టు 17 (తెలంగాణ వాణి)**
రాజపేట మండలంలో గుర్తింపు కార్డులు కలిగిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ తెలంగాణ జర్నలిస్టు యూనియన్ (టీజేయూ) ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తున్న గుర్తింపు పొందిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో టీజేయూ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎండీ. యూసుఫ్, జర్నలిస్టులు పెంట సత్యనారాయణ, బిర్రు బాలకిషన్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ

### ప్రతి ఓటరూ వివరాలు పరిశీలించుకోవాలి: కలెక్టర్ హేమంత్ సహదేవరావు

**ములుగు, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**



ప్రత్యేక సమగ్ర సవరణ--2026లో భాగంగా 109-ములుగు అసెంబ్లీ నియోజకవర్గ ముసాయిదా ఓటర్ల జాబితాను సోమవారం ప్రచురించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు. నియోజక వర్గంలోని 308 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 2,09,128 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. ప్రతి ఓటరూ జాబితాలో తమ పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాలను పరిశీ లించుకోవాలని సూచించారు. కొత్తగా పేరు నమోదు చేసు కునేందుకు ఫారం-6, పేరు తొలగింపు లేదా అభ్యంతరాలకు ఫారం-7, వివరాల సవరణకు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దావాలు, అభ్యంతరాలను బీఎల్ఓలకు, తహసీల్దార్ కార్యాలయాల్లో లేదా ఓటర్ సర్వీస్ పోర్టల్ ద్వారా సమర్పించవచ్చని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు సెప్టెంబర్ 16 వరకు గడువు ఉందని కలెక్టర్ వెల్లడించారు.

## ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

**అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్‌జీ**



**ములుగు, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
ప్రజావాణిలో అందిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్‌జీ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 28 దరఖాస్తులను స్వీకరించారు. వీటిలో భూ సమస్యలకు 3, ఇందిరమ్మ ఇళ్లకు 5, పింఛన్లకు 7, ఇతర సమస్యలకు 13 దరఖాస్తులు ఉన్నాయి. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

## గోపాల్‌రెడ్డి అభిమాని వంశీకి ఘనంగా సన్మానం



**ఎండపల్లి, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామానికి చెందిన మాల సంఘం అధ్యక్షుడు సుద్దమల్ల వంశీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ పీఏసీఎస్ చైర్మన్ మద్దుల గోపాల్‌రెడ్డి తన అభిమాని వంశీని శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గెల్లు చంద్రశేఖర్, సీనియర్ నాయకులు గాజుల విజయ్ గౌడ్, గెల్లు శ్రీనివాస్, మహేష్, నాగరాజు, శంకర్, ఆనంద్, సాయి తరుణ్ తదితరులు పాల్గొన్నారు

## కుటుంబ కలహాలతో రైలు కింద పడి వ్యక్తి మృతి

**జమ్మికుంట, ఆగస్టు 17 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



కుటుంబ, ఆస్తి వివాదాలతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి రైలు కింద పడి మృతిచెందిన ఘటన సోమ వారం జమ్మికుంటలో చోటుచ ేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం అంబేద్కర్ కాలనీకి చెందిన గుల్లి సంపత్ రైల్వే ట్రాక్‌పై రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనా స్థలంలో సూసైడ్ నోట్ లభించినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## జీఓ నంబర్ 97 రద్దు చేయాలి: ఏబీవీపీ

### హుస్నాబాద్‌లో పాలిటెక్నిక్ విద్యార్థుల ర్యాలీ, రాస్తారోకో



**హుస్నాబాద్, ఆగస్టు 17 (తెలంగాణ వాణి ఆర్.సి):**
సాంకేతిక విద్యను 'శక్తి' విభాగంలో విలీనం చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ విద్యార్థులు సోమవారం హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు సావుల ఆదిత్య మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యను బలోపేతం చేసి, కళాశాలల్లో మౌలిక వసతులు, ఆధునిక కోర్సులు, పరిశ్రమల అనుసంధానం, మెరుగైన ప్లేస్‌మెంట్లు కల్పించాలని కోరారు. జీఓను రద్దు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాస్తారోకోతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన విరమించాలని కోరారు. విద్యార్థులు నిరసన కొనసాగించడంతో పలువురు ఏబీవీపీ నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా హాస్టల్స్ కన్వీనర్ రాజేష్, జిల్లా ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ చరణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాహుల్, నగర కార్యదర్శి రాజు, నగర ఉపాధ్యక్షులు సంతోష్, అంజి, మేఘన, రవళి, సంధ్యతో పాటు వందలాది మంది పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేసే కుట్రను తిప్పికొడదాం: రసమయి



**మానకొండూరు, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరోపించారు. సోమవారం మానకొండూరులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించిన ఈ పథకాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పథకాలపై ఆంక్షలు విధించడం సరికాదన్నారు. పథకాల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని రసమయి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ తుల ఉమ, బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణారావు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మండల అధ్యక్షులు, రైతులు, మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలి



**వేములవాడ, ఆగస్టు 17 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో సోమవారం వేములవాడలో నిరసన చేపట్టారు. తెలంగాణ చౌక్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలిచిన పథకాలపై ఎలాంటి ఆంక్షలు విధించకుండా కొనసాగించాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మహిళా కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలి




**నిర్మల్, ఆగస్టు 17 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లను ముందస్తు ప్రణాళికతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ మాట్లాడుతూ బాసర పుష్కర ఘాట్‌కు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున తాగునీరు, మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు, రహదారులు తదితర మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఘాట్ల మరమ్మతులు, భక్తుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ పనుల నాణ్యతను అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, బాసర ఆలయ ఈఓ అంజనా దేవి, ఆర్‌డబ్ల్యూఎస్, నీటిపారుదల, పంచాయతీరాజ్ శాఖల ఈఈలు సందీప్, అనిల్, శంకర్, అగ్నిమాపక అధికారి శివాజీ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి పాదయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్ చెరు, ఆగస్టు 17, (తెలంగాణ వాణి):**
పటాన్ చెరు పట్టణానికి చెందిన సీసాల రాజు ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నిర్వహిస్తున్న పటాన్ చెరు--తిరుపతి పాద యాత్రను సోమవారం ఉదయం పట్టణం లోని మహంకాళి దేవాలయం వద్ద పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. భక్తి శ్రద్ధలతో వరుసగా 22 సంవత్సరాలుగా తిరుపతికి పాదయాత్ర నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఆధ్యాత్మిక విశ్వాసంతో చేపడుతున్న ఈ పాదయాత్ర విజయవంతంగా సాగాలని, యాత్రికులందరి కీ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులు లభించాలని ఆకాంక్షించారు. అనంతరం కిష్టారెడ్డి పేట కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు మాణిక్యం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తిరుపతి పాదయాత్రను కూడా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా యాత్రికులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారు సురక్షితంగా తిరుపతి చేరుకుని స్వామి వారిని దర్శించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్య క్రమంలో మాజీ సర్పంచ్ సపాన్ దేవ్ ముదిరాజ్, ఎం డీ ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు మాదిరి పృథ్వి రాజ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**బీరం గూడ వద్ద స్వాగతం పలికిన ఆదర్శ్ రెడ్డి**
పటాన్‌చెరు పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి భక్త బృందం ఆధ్వర్యంలో సీసాల రాజు నేతృత్వంలో పటాన్‌చెరు మహంకాళి మందిరం నుంచి తిరుమల తిరుపతికి 22వ మహా పాదయాత్ర ప్రారంభమైంది. ఈ సందర్భంగా పటాన్ చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి బీరంగూడ కమాన్ వద్ద పాదయాత్ర చేస్తున్న భక్తులను కలుసుకుని, వారితో మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు భక్తులందరిపై ఉండాలని, పాదయాత్ర విజయవంతంగా, సురక్షితంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వేంకటేశ్వర స్వామి భక్త బృందం సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. అలగే ఇదే కార్యక్రమంలో పటాన్ చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ సోదరుడు మెట్టు ఎల్లేష్ యాదవ్ కూడా పాల్గొన్నారు. అనంతరం పటాన్ చెరు నియోజకవర్గం పరిధిలోని కృష్ణారెడ్డిపేట వాస్తవ్యులు మాణిక్యం వెంకటేశ్వర స్వామి భక్త బృందం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 6వ మహా పాదయాత్ర కార్యక్రమంలో మెట్టు ఎల్లేష్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిష్టారెడ్డిపేట లోని దుర్గా మాత ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మెట్టు ఎల్లేష్ యాదవ్ జెపి కాలనీ డివిజన్ పరిధిలోని నాగులమ్మ గడ్డ కాలనీలో గల శ్రీ నాగులమ్మ అమ్మ వారి ఆలయాన్ని దర్శించుకోనీ ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో , శ్రీనివాస్, అజ్మత్ అజ్జు, కార్తీక్, మిల్క్ రవి, మెట్టు కళ్యాణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఉద్యోగి 'మీ ప్రమాణం' యాప్‌లో నమోదు కావాలి




**నిర్మల్, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో పనిచేసే రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరూ 'మీ ప్రమాణం' ముఖ గుర్తింపు హాజరు యాప్‌లో నమోదు కావాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన, హాజరు నమోదులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే జిల్లా సెన్సస్ హ్యాండ్‌బుక్ కోసం శాఖల వారీగా ఖచ్చితమైన సమాచారాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశం



**నిర్మల్--ముధోల్, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి. విఠల్‌రెడ్డి కూడా సమావేశానికి హాజరై పార్టీకి సంబంధించిన అంశాలపై చర్చించారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, పార్టీ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడం, నాయకులు--కార్యకర్తల మధ్య సమన్వయం పెంపొందించడంపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు.

## దొంగల ఆటకు చెక్.. 25 చోరీ కేసులు ఛేదించిన నిర్మల్ పోలీసులు




**16 కేసుల్లో చోరీ సొత్తు రికవరీ.. ఐదుగురు నిందితుల అరెస్ట్**

**నిర్మల్, ఆగస్టు 17 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జిల్లాలో వరుసగా జరుగుతున్న ఆలయ, ఇళ్ల దొంగతనాలకు నిర్మల్ పోలీసులు చెక్ పెట్టారు. జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'టైగర్స్ టాస్క్‌ఫోర్స్' బృందం సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టి ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసింది. పోలీసుల వివరాల ప్రకారం.. రాజశేఖర్, రాజేశ్వర్, శ్రీకాంత్, రామ్‌చరణ్, క్రాంతి అనే ఐదుగురు నిందితులకు జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన 25 దొంగతనం కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. వీరిలో 16 కేసులకు సంబంధించిన చోరీ సొత్తును రికవరీ చేశారు. నిందితుల నుంచి మూడు ద్విచక్ర వాహనాలు, 7.5 గ్రాముల బంగారం, 300 గ్రాముల వెండి, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిర్మల్ టౌన్, రూరల్‌తో పాటు మామడ, సారంగాపూర్, లోకేశ్వరం, లక్ష్మణచాంద, తానూర్ తదితర ప్రాంతాల్లో జరిగిన ఆలయ, హౌస్ బ్రేకింగ్ కేసులను పోలీసులు ఛేదించారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని గన్నవరం, ఏలూరు ప్రాంతాల్లో జరిగిన ఆలయ చోరీల్లోనూ నిందితుల ప్రమేయాన్ని గుర్తించారు. సీసీ కెమెరా ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, నిందితుల కదలికలు, గత నేరాల వివరాలను విశ్లేషించి కేసులను ఛేదించినట్లు పోలీసులు తెలిపారు. మిగిలిన కేసుల్లోనూ దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు. కేసుల ఛేదనలో కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ జానకి షర్మిల అభినందించారు. జిల్లాలో దొంగతనాల నియంత్రణకు ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, ఆలయాలు, ఇళ్లు, దుకాణాలను లక్ష్యంగా చేసుకునే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.



## పాలిటెక్నిక్ విద్యార్థుల జీవితాలతో చెలగాటం వద్దు: ఎస్ఎఫ్ఐ

**నిర్మల్, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులను ఐటీఐలతో అనుసంధానం చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకుని జీవో నంబర్ 97ను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ నిర్మల్ జిల్లా కన్వీనర్ దిగంబర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి నిర్వహించిన నిరసనలో ఆయన మాట్లాడుతూ, పాలిటెక్నిక్ కోర్సులను మరింత బలోపేతం చేయాల్సింది పోయి డీగ్రేడ్ చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్‌లో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



## నాగోబాను దర్శించుకున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఉట్నూర్, ఆగస్టు 17 (తెలంగాణ వాణి)**
: నాగుల పంచమి సందర్భంగా ఉట్నూర్‌లోని ప్రసిద్ధ నాగోబా ఆలయాన్ని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఉట్నూర్ ఏఎస్పీతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు, కమిటీ సభ్యులు ఎస్పీని సన్మానించారు. అనంతరం జాతర బందోబస్తును పరిశీలించిన ఎస్పీ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అత్యవసర సహాయం కోసం డయల్ 100/112ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉట్నూరు ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, ఉట్నూర్ సీఐ ఎం ప్రసాద్, ఇంద్రవెల్లి ఎస్ఐ సాయన్న, ఎస్ఐ విక్రమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



## మండలంలో సవ్యంగా ప్రజావాణి కార్యక్రమం

**నాగిరెడ్డిపేట మండలం ఆగస్టు 17:( తెలంగాణ వాణి ప్రతినిధి)**
నాగిరెడ్డిపేట మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో మొదటి సారి ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఎమ్మార్వో బిక్షపతి ఎంపీడీవో గంగాధర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రజావాణిలో భాగంగా వివిధ శాఖలకు చెందిన 18 మంది అధికారులు పాల్గొన్నారు . ప్రజా సమస్యలపై ప్రజావాణిలో 9 వినతులు స్వీకరించినట్లు ఎంపీడీవో గంగాధర్ ఎమ్మార్వో బిక్షపతి తెలిపారు . స్వీకరించిన వినతులను వేగ వంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు .

## రాజపేట నుంచి ఆలేరుకు బస్సులు నడపాలి: జూకంటి ప్రవీణ్‌కుమార్




**రాజపేట, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
రాజపేట మండల కేంద్రం నుంచి ఆలేరు, యాదాద్రికి బస్సు సౌకర్యం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం రాజపేట ప్రజావాణిలో ఎంపీడీవో నాగవేణికి వినతిపత్రం అందజేశారు. విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాజపేట నుంచి ఆలేరుకు రోజుకు మూడు, యాదాద్రికి ఐదు ట్రిప్పులు నడపాలని కోరారు. అధికారులు స్పందించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఏమ్మా శ్రీనివాస్, కర్రె కిషన్, వస్పరి రవీందర్, కర్రె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో ఉంచొద్దు



**ఆదిలాబాద్, ఆగస్టు 17 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, ఆర్ఎస్ చిత్రు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన వారు, ప్రతి దరఖాస్తును పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, ఉపాధి హామీ పనులు, భూ సమస్యలపై అధికంగా దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ స్రవంతి, డిఆర్డిఏ రవీందర్ రాథోడ్, ఏవో ఎస్తేర్ వర్ణ,వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

## నియోజకవర్గ యువతకు ఉచిత శిక్షణ



**మందమర్రి, ఆగస్టు 17 (తెలంగాణ వాణి)**
: చెన్నూరు నియోజకవర్గ యువతకు ఎస్సై, కానిస్టేబుల్ పోటీ పరీక్షల కోసం మందమర్రిలో 60 రోజుల పాటు ఉచిత శిక్షణ అందించేందుకు కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నారు. సోమ వారం తహసీల్దార్ సతీష్‌కుమార్ శర్మ, మున్సిపల్ కమిషనర్ రాజలింగు, డీఈ సాయికిరణ్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## సీఎంఆర్ ద్వారా రూ.17 వేల ఆర్థిక సాయం



**ఎల్లారెడ్డి, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
సోమార్పేట గ్రామానికి చెందిన కుమ్మరి సిరియాల అనారోగ్యంతో చికిత్స పొందుతూ వైద్య ఖర్చులకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం ఎమ్మెల్యే మదన్‌మోహన్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే చొరవతో సీఎంఆర్ ద్వారా రూ.17 వేల ఆర్థిక సాయం మంజూరైంది. సోమవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, గ్రామ సర్పంచ్ కురుమ పాపయ్య తదితరుల సమక్షంలో చెక్కును సిరియాలకు అందజేశారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



**మంచిర్యాల,ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
హైదరాబాద్ నాంపల్లిలోని టీఎన్జీవో భవన్‌లో కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన కేంద్ర కార్యవర్గ సమావేశానికి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి, కార్యదర్శి బొడ్డు శ్రావణ్‌కుమార్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య హాజరయ్యారు.ఈ సందర్భంగా గడియారం శ్రీహరి మాట్లాడుతూ ఉద్యోగులకు వెంటనే పీఆర్సీ ప్రకటించాలని, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఈహెచ్ఎస్ కార్డులు పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌కు 17 శాతం ఇంటి అద్దె భత్యం కల్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను త్వరగా విడుదల చేయడంతో పాటు 22ఏ పరిధిలోని టీఎన్జీవో భూములకు మినహాయింపు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఇటీవల మంచిర్యాల జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన బొడ్డు శ్రావణ్‌కుమార్‌ను కేంద్ర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

## లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం: డీఎంహెచ్‌వో




**మంచిర్యాల, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
సమాజ సేవలో లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్ అన్నారు. మంచిర్యాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. 30 ఏళ్లు దాటిన వారు క్రమం తప్పకుండా రక్తపోటు, మధుమేహ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి, శస్త్రచికిత్స అవసరమైన వారిని గుర్తించి ఉచిత చికిత్సకు తరలించారు. అవసరమైన వారికి ఉచిత కంటి అద్దాల ఫ్రేమ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సదానందం, వెంకటేశ్వర్లు, లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ గుర్రాల చక్రధర్ రావు, జోనల్ చైర్‌పర్సన్ ముఖేష్, అధ్యక్ష, కార్యదర్శులు నేరెళ్ల శ్రీనివాస్, కాసం మల్లికార్జున్, ఐ క్యాంప్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాందేవ్, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, రేకుర్తి కంటి ఆసుపత్రి వైద్యులు, ఏఎన్ఎంలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు చిన్నారెడ్డి పరామర్శ



**వనపర్తి, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
పెబ్బేరు పట్టణంలో నారాయణరెడ్డి దశదిన కర్మకు తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి హాజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం పెద్దగూడెం గ్రామంలో గుండె పోటుతో మృతి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రొయ్యల శివన్న భౌతికకాయానికి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీకి శివన్న చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ, ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని చిన్నారెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్, పెద్దగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పకీర్‌పురంలో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ



**నాంపల్లి, ఆగస్టు 17 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
నాంపల్లి మండలం ఫకీర్‌పురం (పులికుంట్ల) గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ నిర్వహించారు. గ్రామ పెద్దలు, యువకులు, స్థానిక నాయకులు పాల్గొని అంబేద్కర్ ఆశయాలను స్మరించుకున్నారు. విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి పథకాన్ని కొనసాగించాలి: కూసుకుంట్ల

**నాంపల్లి, ఆగస్టు 17 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న కల్యాణలక్ష్మి పథకాన్ని నిలిపివేసే ప్రయత్నాలను తిప్పికొడతామని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. చండూరులో మహిళలతో కలిసి ఆయన ధర్నా నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పథకాన్ని కొనసాగించే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాటం చేస్తుందని తెలిపారు.



## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**వనపర్తి, ఆగస్టు 17 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎన్. ఖీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదుల పరిష్కార వివరాలను సంబంధిత దారులకు తెలియజేయడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సోమవారం ప్రజావాణిలో 45, ఆర్డీవో కార్యాలయంలో 5 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో యాదయ్య, శిక్షణ ఉప కలెక్టర్లు మేడం శ్రావ్య, రంజిత్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ముసాయిదా ఓటరు జాబితా విడుదల




**వనపర్తి, ఆగస్టు 17 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎస్ఐఆర్ ప్రక్రియ అనంతరం వనపర్తి జిల్లాలో 2,37,006 మంది ఓటర్లతో ముసాయిదా ఓటరు జాబితాను అదనపు కలెక్టర్ రెవెన్యూ టి. వినోద్‌కుమార్ సోమవారం విడుదల చేశారు. జాబితా ప్రతులను అన్ని పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచడంతో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. గత జాబితాతో పోలిస్తే 38,564 మంది ఓటర్లు తగ్గినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ముసాయిదాలో పేరు లేని వారికి ఈఆర్వోల ద్వారా నోటీసులు జారీ చేసి, ఆధారాలు సమర్పిస్తే తుది జాబితాలో పేరు చేర్చనున్నట్లు చెప్పారు. 18 ఏళ్లు నిండే యువత ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరణించిన లేదా డబుల్ ఓటర్ల పేర్ల తొలగింపునకు ఫారం-7, పేరు, చిరునామా తదితర మార్పులకు ఫారం-8 ద్వారా సెప్టెంబర్ 16లోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు వచ్చిన అభ్యంతరాలను అక్టోబర్ 15లోపు పరిష్కరించి, అక్టోబర్ 19న తుది ఓటరు జాబితా విడుదల చేస్తామని వెల్లడించారు. ఓటర్లు, బూత్ లెవల్ ఏజెంట్లు, బీఎల్‌వోలు ముసాయిదా జాబితాను పరిశీలించి తప్పులు ఉంటే సరిచేసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు.

## బాలాలయంలో భక్తుల సందడి

**మహదేవపూర్, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
శ్రావణమాసం తొలి సోమవారం సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి బాలాలయంలో భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గోదావరి త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించి, సరస్వతి మాతకు చీరె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు, పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.



## ఉత్తమ తహసీల్దార్ వీరబాయికి ఘన సన్మానం

**చౌటుప్పల్, ఆగస్టు 17 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**
: చౌటుప్పల్ మండలంలో ప్రజలకు ఉత్తమ సేవలు అందించినందుకు యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉత్తమ తహసీల్దార్‌గా ఎంపికైన వీరబాయిని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి ఘనంగా సన్మానించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆమె ఉత్తమ తహసీల్దార్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి ఆమెను అభినందించి, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు బాణాల రాంరెడ్డి, గుత్తా వెంకట్‌రెడ్డి, బత్తుల శ్రీహరి, తూర్పుంటి రవి, లచ్చునాయక్, తిగుళ్ల బాలరాజు, జీపీవోలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కొనసాగించాలి




**కమలాపూర్, ఆగస్టు 17 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కమలాపూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ మారపల్లి నవీన్‌కుమార్ మాట్లాడుతూ పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు కేసీఆర్ ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించిందన్నారు. ఎన్నికల హామీ మేరకు తులం బంగారం అందించడంతో పాటు పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పేరాల సంపత్ రావు,తక్కల్లపల్లి సత్యనారాయణ రావు, ఇంద్రసేనారెడ్డి , కమలాపూర్ సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు కౌడగాని రాజేష్, మరియు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## నిరంజన్ రెడ్డికి అభినందనల వెల్లువ

**కరీంనగర్, ఆగస్టు 17 (తెలంగాణ వాణి)**
కరీంనగర్ సీఐ అనుముల నిరంజన్ రెడ్డికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. నక్సల్స్ కార్యకలాపాలు నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడిలో విశేష కృషి చేసిన ఆయన ఇండియన్ పోలీస్ మెడల్ (ఐపీఎం) అందుకున్నారు. ఆగస్ట్ 15న రాష్ట్ర ముఖ్య మంత్రి ఏ రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మెడల్ అందుకున్న నేపథ్యంలో ఆయనను పలువురు అభినందించారు.

**కంగ్రాట్స్ :సీపీ గౌస్ ఆలం**
సోమవారం కరీంనగర్ సీపీ గౌస్ ఆలంను రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి కలిశారు. విధి నిర్వహణలో ధైర్య సహాసాలు ప్రదర్శించిన సీఐ నిరంజన్ రెడ్డి అందించిన సేవలు ఆదర్శప్రాయమన్నారు. ఇండియన్ పోలీస్ మెడల్ అందుకోవడం కరీంనగర్ కమిషనరేట్ కే గర్వకారణం అని అన్నారు. పోలీస్ విభాగంలో శ్రమించి పని చేసిన వారికి గుర్తింపు ఎప్పటికైనా లభిస్తుందన్నారు. సమాజ హితం కోసం పనిచేసి ఇలాంటి అరుదైన మెడల్స్ కు ఎంపిక కావాలని సీపీ పిలుపునిచ్చారు.

**అభినందనలు తెలుపుతున్న ప్రజలు**
కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డికి పోలీసు స్టేషన్ పరిధిలోని ప్రజలు ప్రత్యేకంగా అభినందించారు. ఐపీఎం అందుకున్న సీఐని ఘనంగా సత్కరించారు. ఐపీఎం అందుకున్న తర్వాత తొలిసారి పోలీస్ స్టేషన్ కు చేరుకున్న నిరంజన్ రెడ్డికి సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అత్యంత అరుదైన మెడల్ అందు కోవడం ఆనందంగా ఉందన్నారు. నిరంజన్ రెడ్డిని ఆదర్శంగా తీసుకోవలసిన అవసరం ఉందని పోలీస్ స్టేషన్ సిబ్బంది అభిప్రాయ పడ్డారు.








## తెల్లాపూర్ విద్యాభివృద్ధికి రూ.117 కోట్ల నిధులు

**తెల్లాపూర్, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.117 కోట్ల నిధులు కేటాయించడంపై కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు సి.పి. రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు.మున్సిపల్ కార్యాలయం సమీపంలోని ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి రూ.48 కోట్లు, ఇంద్రానగర్ పాఠశాలకు రూ.28 కోట్లు, తెల్లాపూర్ పాఠశాలకు రూ.26 కోట్లు, డబుల్ బెడ్‌రూమ్ పాఠశాలకు రూ.15 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ నిధులతో విద్యారంగం మరింత అభివృద్ధి చెందుతుందని సి.పి. రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొల్లూరి భరత్, మాజీ ఉప సర్పంచ్ కృష్ణ, కాంగ్రెస్ నాయకులు రవీందర్, సుధాకర్ రెడ్డి, రెడ్డి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పార్కింగ్ స్థలాల పేరుతో రూ.2.5 కోట్ల వసూళ్ల ఆరోపణలు




**అమీన్‌పూర్, ఆగస్టు 17 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జనప్రియ నైల్ వ్యాలీలో పార్కింగ్ స్థలాలు ఇప్పిస్తానని చెప్పి ప్రకాశ్ అనే వ్యక్తి సుమారు 50 మంది నుంచి రూ.2.5 కోట్ల వరకు వసూలు చేసినట్లు పలువురు నివాసితులు ఆరోపించారు. ఒక్కొక్కరి నుంచి రూ.1 లక్ష నుంచి రూ.17 లక్షల వరకు తీసుకున్నట్లు తెలిపారు. గత నాలుగేళ్లుగా ఈ వ్యవహారం కొనసాగుతోందని, ప్రస్తుతం ప్రకాశ్ అందుబాటులో లేకపోవడంతో విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. పార్కింగ్ అగ్రిమెంట్ల ప్రామాణికతపై అనుమానాలున్నాయని పేర్కొంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని, మేనేజ్‌మెంట్ స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

## ఒక్క క్షణం మత్తు.. జీవితమంతా చిత్త



**హుజూర్‌నగర్, ఆగస్టు 17 (తెలంగాణ వాణి)**
: ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు హుజూర్‌నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ చరమంద రాజు, ఎస్సై చలికంటి నరేష్ ఆధ్వర్యంలో గంజాయి, డ్రగ్స్, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలు శరీరంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని, యువత వాటికి బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ వారు జాన్మియా, మహేష్, అనూష, కాశయ్య, పోలీస్ కళాబృందం, గోపయ్య, సత్యం, చారి, కృష్ణ, నాగార్జున విద్యార్థులు పాల్గొన్నారు

## కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కొనసాగించాలి



**నర్సంపేట, ఆగస్టు 17 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించి, ఎన్నికల హామీ మేరకు ఆడబిడ్డలకు తులం బంగారం అందించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు నర్సంపేటలో నిరసన చేపట్టారు. అమరవీరుల స్థూపం వద్ద నిరసన అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఏఓకు వినతిపత్రం అందజేశారు. పేద కుటుంబాలకు అండగా నిలిచిన సంక్షేమ పథకాలను రద్దు చేసే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు రాయిడి రవీందర్ రెడ్డి, నల్ల మనోహర్ రెడ్డి ,లెక్కల విద్యాసాగర్ రెడ్డి, తక్కలపల్లి రవీందర్ రావు, నామాల సత్యనారాయణ, నాడెం శాంతి కుమార్ ,గోనె యువరాజు, వేణుముద్దల, శ్రీధర్ రెడ్డి, నాగిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## స్టాక్ ఉన్నా పాలు, గుడ్ల పంపిణీకి బ్రేక్!

### అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారుల అవస్థలు.. తనిఖీలు చేపట్టాలని డిమాండ్

**మల్హర్‌రావు, ఆగస్టు 17 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పాలు, కోడిగుడ్ల పంపిణీపై లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి సరుకులు సకాలంలో చేరుతున్నప్పటికీ, కేంద్రాల్లో స్టాక్ ఉన్నా పసిపిల్లలు, గర్భిణులు, బాలింతలకు సక్రమంగా పంపిణీ చేయడం లేదని ఆరోపిస్తున్నారు. పాలు, గుడ్ల కోసం అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్తున్న లబ్ధిదారులను "రేపు రండి", "స్టాక్ నమోదు కాలేదు" అంటూ తిప్పి పంపుతున్నారని పలువురు వాపోయారు. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సరుకులు ఆలస్యం చేయడం వల్ల పాలు పాడవడం, గుడ్లు దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రికార్డుల్లో మాత్రం పూర్తి స్థాయిలో పంపిణీ చేసినట్లు నమోదు చేస్తున్నారనే ఆరోపణలపై అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ అధికారులు, సూపర్‌వైజర్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి స్టాక్ రిజిస్టర్లు, పంపిణీ వివరాలను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని డిమాండ్ చేస్తున్నారు.

## బుగ్గారం మండలం పలు గ్రామాల్లో నాగుల పంచమి పుట్టకు పాల పూజలు



**జగిత్యాల /బుగ్గారం :17 ఆగస్టు (తెలంగాణ వాణి విలేకరి)**
జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం పలు గ్రామాల్లో యశ్వంతరావు పేట గోపాలపురం తదితర గ్రామాల్లో సోమవారం రోజుల నాగుల చవితి అనుసరించి ఆడపడుచులు అన్యోన్యంగా అంగరంగ వైభవంగా పసుపు కుంకుమాలు పూలు పండ్లు పాల పూజలతో పిల్లాపాపలతో సందడి సందడిగా తండోపతండాలుగా నాగుల పుట్ట ఆలయస్థలాలకు చేరుకొని పూజలు చేశారు. ఈ ఆలయ ప్రాంగణాల్లో అన్నదాన కార్యక్రమాలు కూడా వారి వారి కమిటీ సభ్యులు సహకారంతో ఆలయ ప్రాంగణానికి వచ్చినటువంటి భక్తులకు అన్నదాన కార్యక్రమం కూడ ఏర్పాటు చేసి మంచి సౌకర్యాన్ని కల్పించారు.

## కేసీఆర్ మళ్లీ సీఎం కావాలి: బొబ్బ నవతారెడ్డి

### కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కొనసాగించాలని డిమాండ్



**హైదరాబాద్/శేరిలింగంపల్లి, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోవాలని మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి అన్నారు. శేరిలింగంపల్లి చందానగర్ పీజేఆర్ స్టేడియం నుంచి ఆమె ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులతో భారీ ర్యాలీ నిర్వహించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను వెంటనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. పథకాలను కొనసాగించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వృద్ధుడి మృతి

### ఆచూకీ తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలి

**జమ్మికుంట, ఆగస్టు 17 (టుడేస్ న్యూస్):**



జమ్మికుంట పట్టణంలోని పోస్టాఫీస్ సమీపంలో అనారోగ్యంతో ఉన్న సుమారు 70--75 ఏళ్ల గుర్తుతెలియని వృద్ధుడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, ఆగస్టు 15న చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు, కుటుంబ సభ్యుల ఆచూకీ తెలియరాలేదని పేర్కొన్నారు. మృతుడిని గుర్తించిన వారు లేదా సమాచారం తెలిసిన వారు జమ్మికుంట పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

## ఆర్టీఐ చట్టం సాధన కమిటీ జిల్లా ఉపాధ్యక్షురాలిగా జయకుమారి

**కొత్తగూడెం, ఆగస్టు 17 (తెలంగాణ వాణి)**



సమాచార హక్కు చట్టం సాధన కమిటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షురాలిగా పొన్నెకంటి జయకుమారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లో కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్ ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చంటి ముదిరాజ్, సూర స్రవంతి మాట్లాడుతూ జిల్లాలో సమాచార హక్కు చట్టం సాధన కమిటీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు భవిష్యత్తులో రాష్ట్ర సమాచార కమిషనర్లతో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, చట్టం ద్వారా లభించే హక్కులు, ప్రయోజనాలపై విస్తృత అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కమిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నెకంటి సంజీవరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి : కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్, ఆగస్టు 17 (తెలంగాణ వాణి ప్రతినిది)**
ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించగా డీఆర్వో స్వామి, శాఖల అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమాన్ని సీఎం క్యాంపు కార్యాలయం, చీఫ్ సెక్రటరీ నిరంత రం పర్యవేక్షిస్తున్నారని 30 రోజులు దాటిన దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుం డా సత్వరం పరిష్కరించా లని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరిష్కరించిన దరఖాస్తుల ను ఎప్పటికప్పుడు లాగిన్ లో అప్డేట్ చేయించాలని సూచించారు.పింఛన్ల దరఖాస్తు సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.లబ్ధిదారులు ఎవరు మిస్ కావద్దని చేసు కోవాలని సూచించారు. యూనిఫామ్ పంపిణీలో ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాల ని పేర్కొన్నారు.



**పింఛన్ల దరఖాస్తుకు ఫుడ్ సెక్యూరిటీ కార్డు ప్రమాణికం**
**వృద్ధాప్య పింఛన్ మినహా అన్ని పింఛన్ల దరఖాస్తులు స్వీకరిస్తాం**
**ప్రతి పంచాయతీ హెల్ప్ డెస్క్ ఏర్పాటు**

చేయూత పింఛన్లకు సంబం ధించి ప్రజావాణి కార్యక్రమం లో డీఆర్డీఓ గీత,మెప్మా పీడీ స్వరూప రాణి మాట్లాడు తూ ప్రస్తుతం వృద్ధాప్య పింఛన్లు తప్ప మిగతా అన్నింటికీ (ఒంటరి మహిళ లు,చేనేత,గీత కార్మికులు, దివ్యాంగులు తదితరులు) దరఖాస్తులు స్వీకరిస్తున్న ట్లు పేర్కొన్నారు.ఒంటరి మహిళలకు సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో 35 ఏళ్లు,పట్టణ ప్రాంతాల్లో 40 ఏళ్లు నిండి ఉండాలన్నారు.
కొత్త పింఛన్ల దరఖాస్తు కోసం ఆహార భద్రత కార్డునే ప్రామాణికంగా తీసుకుంటు న్నట్లు వివరించారు.నిబంధ నలు మార్చలేదని గతంలో ఉన్న నిబంధనలనే కొనసా గిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులు దరఖాస్తు చేసుకో వాలని సూచించారు.ప్రతి గ్రామపంచాయతీలో, మండల కేంద్రంలో,మున్సి పాలిటీలో,నగరపాలికలో పింఛన్లకు సంబంధించి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని అనుమానాలు ఉంటే సంప్రదించాలని సూచించారు.గతంలో గ్రామసభలు,వార్డుసభలు, ప్రజా పాలన వారోత్సవాల సమయంలో పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారు. మళ్లీ కొత్తగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని గతంలో ఏవైనా పత్రాలు సమర్పించని వారు,దరఖా స్తు చేయనివారు ఇప్పుడు ప్రభుత్వం సూచించిన పత్రాలతో దరఖాస్తు చేసు కోవాలని సూచించారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం అధికారులు ఇంటింటికి వెళ్లి అర్హులను గుర్తిస్తారని పేర్కొన్నారు.

## చెరువు మట్టితో రోడ్డు బేస్‌నా?

**రూ.10 కోట్ల రహదారి పనులపై సర్పంచ్ ఆరోపణలు**
**లక్ష్మీదేవిపల్లి (తెలంగాణ వాణి)**
రేగళ్ల--కరకవాగు రహదారి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని రేగళ్ల పెద్దతండా సర్పంచ్ లావుడ్య పూర్ణ ఆరోపించారు. సుమారు రూ.10 కోట్లతో చేపడుతున్న పనుల్లో రోడ్డు షోల్డర్లకు చెరువు మట్టి వినియోగించి, పైభాగంలో ఎర్రమట్టి వేస్తున్నారని ప్రజాదర్బార్‌లో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నాసిరకం మట్టిని తొలగించి, నాణ్యతా ప్రమాణాల ప్రకారం రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. మట్టి నమూనాలను పరీక్షించి పనులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరారు. అలాగే పెద్దతండా, రేగళ్ల ఎస్సీ కాలనీలో రహదారికి ఇరువైపులా సీసీ డ్రైన్లు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాధనం వృథా కాకుండా పనులపై ప్రత్యేక నిఘా పెట్టాలని సర్పంచ్ కోరారు.




## ఏఐటీయూసీలో 50 మంది ఆటో కార్మికుల చేరిక

**జూలూరుపాడు, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
జూలూరుపాడు బస్టాండ్ ఆటో అడ్డాకు చెందిన 50 మంది కార్మికులు టీఏడీయూ నుంచి ఏఐటీయూసీలో చేరారు. ఏఐటీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల జమలయ్య వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మోటపోతుల ఆనందరావు, కార్యదర్శిగా మంద లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటో స్టాండ్లు, ఇందిరమ్మ ఇళ్లు, కార్పొరేషన్ల ద్వారా ఆటోలు మంజూరు చేయాలని జమలయ్య డిమాండ్ చేశారు.



కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

## ముసాయిదా ఓటరు జాబితా విడుదల



**ఖమ్మం, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఖమ్మం జిల్లాలో 10,85,927 మంది ఓటర్లతో ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి జాబితా వివరాలను వెల్లడించారు. ముసాయిదాలో 1,33,004 మంది ఓటర్లను అనామలీస్‌గా, 43,131 మందిని మ్యాపింగ్ లేనివారిగా గుర్తించామని, మొత్తం 1,76,135 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. నోటీసులు అందుకున్న వారు సంబంధిత పత్రాలు సమర్పించాలని సూచించారు. ముసాయిదా జాబితాపై ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. కొత్త ఓటర్లు ఫారం-6, తొలగింపులకు ఫారం-7, వివరాల సవరణలకు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అక్టోబర్ 19న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

## సాగర్ ఆయకట్టు రైతుల పంటలను కాపాడాలి: మంత్రి తుమ్మల

**ఖమ్మం, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
సాగర్ ఆయకట్టు రైతుల పంటలు ఎండిపోకుండా సకాలంలో సాగునీరు అందించాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగిస్తూ కాలువలు, కెనాల్‌లను నిరంతరం పర్యవేక్షించి నీటి వృథాను అరికట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను రాజీవ్ లింక్ కెనాల్‌కు విడుదల చేసినట్లు తెలిపారు. ప్రధాన, ఉపకాలువల్లో గండ్లు, లీకేజీలు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఆయకట్టు చివరి భూముల వరకు నీరు చేరేలా అధికారులు సమన్వయంతో



పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. రైతుల పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వానికి సహకరించిన సీఎం, నీటిపారుదల శాఖ మంత్రికి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

**ఖమ్మం, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**



ప్రజావాణిలో అందిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డితో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. భూ సమస్యలు, ఉపాధి, పెండింగ్ జీతాలు, సంక్షేమ పథకాలు తదితర అంశాలపై వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో దీక్షా రైనా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.




## శ్రీశైలం హైవేపై గుర్తు తెలియని వాహనం ఢీకొని చిరుత పులి కూన మృతి

**అచ్చంపేట్, ఆగస్టు 17 (తెలంగాణ వాణి న్యూస్ ప్రతినిధి)**
నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూర్ రేంజ్ పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో రోడ్డు ప్రమాదానికి గురై చిరుత పులి కూన మృతి చెందింది. గుండం సమీపంలోని 331వ కంపార్ట్‌మెంట్ వద్ద శనివారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. గస్తీ నిర్వహిస్తున్న అటవీ సిబ్బంది గుర్తించి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. జాతీయ పులుల సంరక్షణ సంస్థ మార్గదర్శకాల ప్రకారం పోస్టుమార్టం అనంతరం ఖననం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.



## మండల కేంద్రంలో ప్రజావాణి

### ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదిక

**బుగ్గారం, ఆగస్టు 13 (తెలంగాణ వాణి):**
ప్రభుత్వ ఆదేశాల మేరకు బుగ్గారం మండల కేంద్రంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. తొలి ప్రజావాణిలో సీనియర్ జర్నలిస్టు చుక్క గంగారెడ్డి పలు సమస్యలపై ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. బుగ్గారానికి మరో 200 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని, ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత అనుమతులు ఇవ్వాలని కోరారు. అలాగే మండల సమాఖ్య, వీఓ, అంగన్‌వాడీ భవనాలకు స్థలాలు కేటాయించాలని, డబుల్ రోడ్డు బాధితులకు నష్టపరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ వినతులను తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపీవో బింగి సురేష్ పరిశీలించారు.

## కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కొనసాగించాలి

### బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు.. జాజాల సురేందర్ హౌస్ అరెస్ట్



**కామారెడ్డి, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కామారెడ్డి జిల్లాలో పార్టీ శ్రేణులు నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలిచే పథకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయకూడదని సురేందర్ డిమాండ్ చేశారు. అనంతరం నాగిరెడ్డిపేట మండలంలో సురేందర్‌ను పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు ఎన్‌హెచ్--765డీపై రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని రాకపోకలను పునరుద్ధరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సైబర్ అవగాహనలో గీతం విద్యార్థుల ప్రతిభ

### 'సురక్షా కా తిరంగా' పోటీలో ప్రథమ బహుమతి



**పటాన్‌చెరు, ఆగస్టు 17 (తెలంగాణ వాణి):**
ఆన్‌లైన్ సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో నిర్వహించిన రాష్ట్రస్థాయి షార్ట్ వీడియో, రీల్ పోటీలో హైదరాబాద్ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. 'సురక్షా కా తిరంగా' కార్యక్రమంలో భాగంగా రూపొందించిన సృజనాత్మక వీడియోకు ఈ పురస్కారం లభించింది. బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున, డీజీపీ సీవీ ఆనంద్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ తదితరుల చేతుల మీదుగా విద్యార్థులు ప్రశంసా పత్రాలు అందుకున్నారు.సంగారెడ్డి డీఎస్పీ వేణుగోపాలరెడ్డి సహకారంతో గీతం స్మార్క్ క్లబ్ విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి. శశివర్ధన్ సమన్వయం చేశారు.

## 'కొరియన్ కనకరాజు'కు హాలిడే బూస్ట్..
## 9వ రోజూ అదరగొట్టిన వరుణ్ తేజ్ సినిమా!



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన హారర్ కామెడీ చిత్రం ' కొరియన్ కనకరాజు' బాక్సాఫీస్ వద్ద అదే జోరును కొనసాగిస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వచ్చిన హాలిడే అడ్వాంటేజ్‌ను పూర్తిగా సద్వినియోగం చేసుకుంది. హాలిడే కావడంతో థియేటర్లలో ప్రేక్షకుల రద్దీ పెరగడంతో పాటు టికెట్ సేల్స్ కూడా బాగానే పెరిగాయి. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం రోజున బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ ప్లాట్‌ఫామ్‌లలో కలిపి దాదాపు 56 వేల టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. విడుదలైన తొమ్మిదో రోజున కూడా ఈ స్థాయిలో టికెట్ డిమాండ్ ఉండటం సినిమాకు పాజిటివ్ అంశంగా మారింది. హాలిడే కారణంగా ఫ్యామిలీ ఆడియెన్స్‌తో పాటు యూత్ కూడా థియేటర్లకు రావడంతో 'కొరియన్ కనకరాజు'కు మంచి ఆక్యుపెన్సీ నమోదైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే సినిమాకు వచ్చిన వర్డ్ ఆఫ్ మౌత్ కూడా ప్రేక్షకులను థియేటర్ల వైపు తీసుకువస్తున్నట్లు ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. టికెట్లకు డిమాండ్ పెరగడంతో పలు ప్రాంతాల్లో థియేటర్ యాజమాన్యాలు అదనపు షోలను కూడా ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా హాలిడే రోజున పెరిగిన ఆక్యుపెన్సీని దృష్టిలో పెట్టుకుని మరిన్ని షోలు అందుబాటులోకి తీసుకురావడం సినిమాకు మరో బూస్ట్ ఇచ్చింది. సాధారణ రోజులతో పోలిస్తే స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రేక్షకుల స్పందన మెరుగ్గా ఉండటంతో.. రాబోయే రోజుల్లో కూడా సినిమా బాక్సాఫీస్ వద్ద తన రన్‌ను కొనసాగించే అవకాశం కనిపిస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవం తర్వాత వచ్చిన ఆదివారం కూడా 'కొరియన్ కనకరాజు'కు కీలకంగా మారింది. ముఖ్యంగా ఆదివారం సాయంత్రం షోలకు టికెట్లకు మంచి డిమాండ్ కనిపిస్తున్నట్లు సమాచారం. హాలిడే వీకెండ్‌లో వచ్చిన బూస్ట్‌తో ఆదివారం కూడా సినిమా మరో మంచి నంబర్ నమోదు చేసే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సినిమా ఇదే స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకుంటే రెండో వీకెండ్‌లోనూ వసూళ్లు నిలకడగా ఉండే అవకాశం ఉంది. వరుణ్ తేజ్ ఈ సినిమాలో ఇప్పటివరకు చేయని తరహాలో హారర్ కామెడీ జానర్‌లో కనిపించారు. మేర్లపాక గాంధీ తనదైన కామెడీ టచ్‌తో పాటు హారర్ ఎలిమెంట్స్‌ను మేళవించి సినిమాను తెరకెక్కించారు. ఈ చిత్రంలో రితికా నాయక్ కథానాయికగా నటించారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై సినిమాను నిర్మించారు. ప్రముఖ సంగీత దర్శకుడు థమన్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. మొత్తానికి తొమ్మిదో రోజుకు చేరుకున్నప్పటికీ 'కనకరాజు'కు టికెట్ డిమాండ్ కొనసాగడం విశేషంగా మారింది. ముఖ్యంగా ఇండిపెండెన్స్ డే హాలిడే సినిమాకు మంచి బూస్ట్ ఇవ్వడంతో.. ఆదివారం కూడా ఇదే జోరు కొనసాగుతుందా, రెండో వీకెండ్‌లో బాక్సాఫీస్ వద్ద ఎలాంటి నంబర్లు నమోదు చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది.




## బాక్సాఫీస్ వద్ద సూర్య రికార్డుల మోత..
## రెండు రోజుల్లోనే రూ.100 కోట్ల క్లబ్‌లో 'విశ్వనాథ్ అండ్ సన్స్'!

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య బాక్సాఫీస్ వద్ద తన సత్తా ఏంటో మరోసారి నిరూపించారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన తాజా పాన్ ఇండియా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్' బాక్సాఫీస్ వద్ద సంచలన వసూళ్లతో దూసుకుపోతోంది. సినిమా విడుదలైన కేవలం రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 100 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లను సాధించి అరుదైన రికార్డును సృష్టించింది.వీశీజఅవం ఈ చిత్రంలో సూర్య సరసన మమిత బైజు హీరోయిన్‌గా నటించగా, రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం సినిమా విజయానికి ప్రధాన బలంగా నిలిచింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, శ్రీకర స్టూడియోస్ పతాకాలపై సూర్య సృష్టించిన ఈ సునామీ వసూళ్లతో ట్రేడ్ వర్గాలు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం థియేటర్ల వద్ద 'బ్లాక్‌బస్టర్ విశ్వనాథ్ అండ్ సన్స్' జోరు కొనసాగుతుండటంతో చిత్ర యూనిట్ ఆనందంలో మునిగిపోయింది. త్వరలోనే ఈ సినిమా మరిన్ని రికార్డులను బ్రేక్ చేసే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.ఖ

## రెండు రోజుల్లోనే రూ.80 కోట్లు..
## బాక్సాఫీస్ వద్ద దుమ్మురేపుతున్న
## ఇమ్రాన్ హాష్మీ 'ఆవారాపన్ 2'



బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రలో నితిన్ కక్కర్ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'ఆవారాపన్ 2' బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవ వీకెండ్ కానుకగా ఆగస్ట్ 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా విడుదలైన రోజు నుంచే బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. ఈ సినిమాతో పోటీగా బరిలోకి దిగిన సినిమాల కంటే ముందు వరుసలో నిలిచి తన జోరును కొనసాగిస్తోంది. మొదటి రోజుతో పోలిస్తే శనివారం ఈ సినిమా కలెక్షన్స్ ఏకంగా 53 శాతానికి పైగా వృద్ధిని నమోదు చేశాయి. తాజాగా రిపోర్ట్స్ ప్రకారం.. దేశవ్యాప్తంగా దాదాపు 10,496 షోలతో 'ఆవారాపన్ 2' రెండవ రోజు రూ. 33.75 కోట్ల నెట్ వసూళ్లను సాధించింది. దీంతో రెండు రోజుల్లో భారతదేశంలో దీని నెట్ కలెక్షన్లు రూ. 55.75 కోట్లకు చేరుకోగా, ఇండియా గ్రాస్ రూ. 66.90 కోట్లుగా నమోదయ్యాయి. కేవలం దేశంలోనే కాకుండా ఓవర్సీస్ మార్కెట్‌లోనూ ఈ చిత్రం సత్తా చాటుతోంది. శనివారం విదేశాల్లో సుమారు రూ. 3.50 కోట్లు రాబట్టగా, మొత్తం ఓవర్సీస్ గ్రాస్ రూ. 6 కోట్లకు చేరింది. దీంతో ఈ సినిమా ప్రపంచవ్యాప్త గ్రాస్ కలెక్షన్స్ సుమారు రూ. 72.90 కోట్లకు చేరుకుని, రూ. 80 కోట్ల మైలురాయికి చేరువయ్యింది. 2007లో వచ్చిన కల్ట్ హిట్ 'ఆవారాపన్' చిత్రానికి ఇది సీక్వెల్‌గా వచ్చింది. మొదటి భాగం మొత్తం వసూలు చేసిన కలెక్షన్ల కంటే, ఈ సీక్వెల్ ఒక్క రోజులోనే దానికంటే సుమారు 27 రెట్లు అధిక వసూళ్లను సాధించి సరికొత్త రికార్డుల వైపు అడుగులు వేస్తోంది. ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీతో పాటు దిశా పటాని, షబానా ఆజ్మీ, సువిందర్ విక్కీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఆదివారం వీకెండ్ ముగిసేసరికి కలెక్షన్స్ మరింత బలపడే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



## 'ఇరుముడి'లోని
## అయ్యప్ప సాంగ్ చూశారా?

రవితేజ హీరోగా చేస్తున్న లేటెస్ట్ సినిమా 'ఇరుముడి'. అయ్యప్పస్వామి నేపథ్యం కూడా ఇందులో కొంతమేర ఉంది. ఇప్పటికే పాటలు, ట్రైలర్ రిలీజయ్యాయి. ఈ శుక్రవారమే (ఆగస్టు 21) మూవీ థియేటర్లలోకి రానుంది. ఈ క్రమంలోనే తాజాగా హైదరాబాద్‌లో ఈవెంట్ నిర్వహించారు. ఇందులోనే 'మల్లెపూల పల్లకి' అంటూ సాగే అయ్యప్ప పాటని విడుదల చేశారు. శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రవితేజ ఓ మధ్య తరగతి తండ్రిగా నటించాడు. ప్రియా భవానీ శంకర్ ఇతడికి జంటగా కనిపించనుంది. నక్షత్ర అనే బాలనటి, రవితేజ కూతురిగా చేసింది. జీవీ ప్రకాశ్ సంగీతమందించాడు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించింది. గత కొన్నేళ్లుగా హిట్ అనేది లేని రవితేజకు ఇది కమ్ బ్యాక్ అవుతుందని అభిమానులు అనుకుంటున్నారు. మరి ఇదెంత వరకు నెరవేరుస్తుందో చూడాలి?

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com